
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
మంగళవారం 4 జూన్ 2024





జడ్జిమెంట్ డే

- వీడనున్న ఉత్కంఠ
- నేడే సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు
- తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- పోలీసుల దిగ్బంధంలో రాయచోటి
- భారీ బందోబస్తు ఏర్పాటు



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన కంప్యూటర్లు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలు ముగిసిన సుమారు 22 రోజుల సుదీర్ఘ ఉత్కంఠకు నేటితో తెరపడనుంది. జిల్లా కేంద్రంలోని శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో మంగళవారం ఓట్ల లెక్కింపు జరగనుంది. దీంతో ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యం తేలిపోనుంది. ఓట్ల లెక్కింపునకు జిల్లా అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసింది. రాష్ట్రంలో పలు ప్రాంతాలలో ఎన్నికల అనంతరం జరిగిన హింసాత్మక సంఘటనల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో జిల్లా అధికారులు పటిష్ట చర్యలు తీసుకున్నారు. రాయచోటి జిల్లా కేంద్రాన్ని పోలీసులు అష్టదిగ్బంధనం చేశారు. ఓట్ల లెక్కింపు కేంద్రం పరిసరాలతో పాటు పట్టణమంతా భారీగా బందోబస్తును ఏర్పాటు చేశారు.

22 రోజుల ఉత్కంఠ

మే 13న సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి. సాధారణంగా మూడు, నాలుగు రోజుల్లో ఓట్ల లెక్కింపు చేపట్టేవాళ్లు. అయితే దేశ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు ఏడు దశల్లో జరిగిన నేపథ్యంలో మన రాష్ట్రంలో జరిగిన లెక్కింపు ఆలస్యం అయింది. దీంతో అటు అభ్యర్థులతో పాటు అనుచరులు, రాజకీయ పార్టీల నాయకులు, బెట్టింగ్‌రాయుళ్లు అందరిలోనూ ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అభ్యర్థులు, నాయకులు కాకిలెక్కల్లో మునిగిపోయారు. ఈ నేపథ్యంలో మంగళవారం జరగనున్న ఓట్ల లెక్కింపుతో అభ్యర్థుల జాతకాలు తేలిపోనున్నాయి. ఎవరు విజేతలో.? ఎవరు పరాజితులో? స్పష్టం కానుంది. ప్రజలు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి అధికారం కట్టబెట్టనున్నారా? అధికార వైసీపీకి పట్టం కట్టనున్నారా అన్నది తేలిపోనుంది.

పోలైన ఓట్లు 11,10,831

జిల్లాలో మొత్తం ఓట్లు 14,26,834 ఓట్లు ఉన్నాయి. అందులో 11,10,831 ఓట్లు పోలయ్యాయి. పోలైన ఓట్లను నియోజకవర్గాల వారీగా చూస్తే రాజంపేటలో 2,41,200 ఓట్లకు గాను 1,83,442 పోలయ్యాయి. 76.05 శాతం నమోదైంది. రైల్వేకోడూరు నియోజకవర్గంలో 2,04,466 ఓట్లకు గానూ 1,52,552 ఓట్లు పోలయ్యాయి. 74.61 శాతం నమోదైంది. రాయచోటిలో 2,55,168 ఓట్లకు గాను 1,97,462 పోలయ్యాయి. 77.39 శాతం నమోదైంది. తంబళ్ళపల్లెలో 2,24,802 ఓట్లకు గానూ 1,86,894 పోలయ్యాయి. 83.14 శాతం నమోదైంది. పీలేరులో 2,34,608 ఓట్లకు గాను 1,90,234 ఓట్లు పోలయ్యాయి. 81.09 శాతం నమోదైంది. మదనపల్లెలో 2,66,590 ఓట్లకు గాను 2,00,247 పోలయ్యాయి. 75.11 శాతం నమోదైంది. రాజంపేట పార్లమెంటు పరిధిలోని పుంగనూరు అసెంబ్లీ స్థానంలో మొత్తం ఓట్లు 2,38,868 ఓట్లకు గాను 2,06,916 ఓట్లు పోలయ్యాయి. 86.62 శాతం నమోదైంది.

పోస్టల్ బ్యాలెట్ వివరాలను పరిశీలిస్తే..

రాజంపేటలో హోం ఓటింగ్ 165కు 151 పోలయ్యాయి. ఎన్నికల విధులకు హాజరైన సిబ్బంది (ఫెసిలిటేషన్ కేంద్రంలో ఓటు ఉన్న) 2102 ఓట్లకు 1938 పోలయ్యాయి. అత్యవసర సర్వీసుల ఓట్లు 285కు 273 పోలయ్యాయి. రైల్వేకోడూరులో హోం ఓటింగ్ 159కు 153 పోలయ్యాయి. ఎన్నికల విధులకు హాజరైన సిబ్బంది 1547 ఓట్లకు 1312 పోలయ్యాయి. అత్యవసర సర్వీసుల ఓట్లు 89 ఓట్లకు 64 పోలయ్యాయి. రాయచోటిలో హోం ఓటింగ్ 22 ఓట్లకు 21 పోలయ్యాయి. ఎన్నికల విధులకు హాజరైన సిబ్బంది 3026 ఓట్లకు 2882 పోలయ్యాయి. అత్యవసర సర్వీసుల ఓట్లు 97కు 83 పోలయ్యాయి. తంబళ్లపల్లెలో హోం ఓటింగ్ 161 ఓట్లకు 161 పోలయ్యాయి. ఎన్నికల విధులకు హాజరైన సిబ్బంది 1624 ఓట్లకు 1518 ఓట్లు పోలయ్యాయి. అత్యవసర సర్వీసుల ఓట్లు 70కి 65 పోలయ్యాయి. పీలేరు నియోకవర్గంలో హోం ఓటింగ్ 155 ఓట్లకు 151 పోలయ్యాయి. ఎన్నికల విధులకు హాజరైన సిబ్బంది 2660 ఓట్లకు 2569 పోలయ్యాయి. అత్యవసర సర్వీసుల ఓట్లు 73కు 66 పోలయ్యాయి. మదనపల్లె నియోజకవర్గంలో హోం ఓటింగ్ 52 ఓట్లకు 51 పోలయ్యాయి. ఎన్నికల విధులకు హాజరైన సిబ్బంది 3050 ఓట్లకు 2665 ఓట్లు పోలయ్యాయి. అత్యవసర సర్వీసుల ఓట్లు 153కు 47 పోలయ్యాయి. పుంగనూరు నియోజకవర్గంలో హోం ఓటింగ్ 58 పోలయ్యాయి. ఎన్నికల విధులకు హాజరైన సిబ్బంది 1821 ఓట్లు పోలయ్యాయి. అత్యవసర సర్వీసుల ఓట్లు 445 పోలయ్యాయి.

ఓట్ల లెక్కింపు వివరాలు

నియోజకవర్గాల వారీగా ఓట్ల లెక్కింపు, టేబుళ్ల వివరాలను పరిశీలిస్తే ప్రతి నియోజకవర్గానికి 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. పోలైన ఓట్లను బట్టి రౌండ్లు ఏర్పాటు చేశారు. రాజంపేటకు 20 లేదా 21 రౌండ్లు ఉంటాయి. రైల్వేకోడూరుకు 18 రౌండ్లు, రాయచోటికి 21 రౌండ్లు, తంబళ్లపల్లెకు 17 రౌండ్లు, పీలేరుకు 20 రౌండ్లు, మదనపల్లెకు 18 లేదా 19 రౌండ్లు ఉంటాయి. 14 టేబుళ్లకు 14 ఈవీఎంలు ఇస్తారు. 14 టేబుళ్ల కౌంటింగ్ పూర్తయితే ఒక రౌండు పూర్తయినట్లు పరిగణిస్తారు. ఇదేవిధంగా రాజంపేట పార్లమెంటు స్థానానికి కూడా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా లెక్కింపు చేపడతారు. పుంగనూరు అసెంబ్లీ స్థానంలోని ఓట్లను చిత్తూరు జిల్లా కేంద్రంలో లెక్కిస్తారు. శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలోని ఓట్ల లెక్కింపు కేంద్రంలో గ్రౌండ్‌ఫ్లోర్‌లో రాజంపేట పార్లమెంటు పరిధిలోని రాయచోటి సెగ్మెంట్, రాజంపేట పార్లమెంటు పోస్టల్ బ్యాలెట్, రాయచోటి అసెంబ్లీ నియోజకవర్గ ఓట్లను లెక్కిస్తారు. ఫస్ట్‌ఫ్లోర్‌లో రాజంపేట, తంబళ్లపల్లె, పీలేరు, మదనపల్లె సెగ్మెంట్ల ఓట్లను లెక్కిస్తారు. సెకండ్ ఫ్లోర్‌లో రైల్వేకోడూరు పార్లమెంట్ సెగ్మెంట్‌తో పాటు రైల్వేకోడూరు అసెంబ్లీ నియోజకవర్గ ఓట్లను లెక్కిస్తారు.

పటిష్ట భద్రతా చర్యలు

ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎన్నికల అధికారులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. ఈవీఎంలను భద్రపరచిన స్ట్రాంగ్ రూముల వద్ద ఆయుధాలతో ఉన్న కేంద్ర బలగాలను మోహరించారు. తమిళనాడుకు చెందిన బలగాలను కూడా రప్పించారు. ఈ బలగాలు నిరంతరం పహారా కాస్తున్నాయి. ఓట్ల లెక్కింపు కేంద్ర పరిసరాలలో కఠిన ఆంక్షలను అమలు చేస్తున్నారు. పాసులు ఉన్న వారిని మాత్రమే ఆ పరిసరాలకు అనుమతిస్తున్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలో కూడా ఘర్షణలకు కారణమయ్యే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారులు హెచ్చరించారు. ఆయా అభ్యర్థుల తరఫున ఓట్ల లెక్కింపునకు హాజరయ్యే ఏజెంట్లు సంయమనంతో ఉండాలని హెచ్చరిస్తున్నారు. ఇదే విధంగా జిల్లా కేంద్రంలో 144 సెక్షన్ అమలులో ఉండడంతో వ్యాపారులు స్వచ్ఛందంగా తమ దుకాణాలు మూసివేయాలని సూచిస్తున్నారు. రోడ్లపైన ఎక్కడిపడితే అక్కడ గుంపులుగా జనాలు ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు ఆటోలో మైకు ద్వారా పట్టణమంతా ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రజలు నిబంధనలను పాటించి ప్రశాంత వాతావరణానికి సహకరించాలని అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి, రూరల్ సీఐ తులసీరామ్‌లు పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎటువంటి హింసాత్మక చర్యలు జర గకుండా ముందస్తు జాగ్రత్తగా ఎస్పీ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సాయుధ బలగాలను రప్పించారు. పట్టణంలోని ముఖ్య కూడళ్లలో ఈ బలగాలను మోహరించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ సోమవారం ఓట్ల లెక్కింపు కేంద్రంలో జరుగుతున్న ఏర్పాట్లను ఎన్నికల పరిశీలకులతో కలిసి పరిశీలించారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ఇలా..

- రాజంపేట అసెంబ్లీ : పోలైన పోస్టల్ బ్యాలెట్లు 3035, రెండు రౌండ్లలో లెక్కింపు
- రైల్వేకోడూరు అసెంబ్లీ : పోలైన పోస్టల్ బ్యాలెట్లు 1784, రెండు రౌండ్లలో లెక్కింపు
- రాయచోటి అసెంబ్లీ : పోలైన పోస్టల్ బ్యాలెట్లు 3534, రెండు రౌండ్లలో లెక్కింపు
- తంబళ్లపల్లె అసెంబ్లీ : పోలైన పోస్టల్ బ్యాలెట్లు 2109, రెండు రౌండ్లలో లెక్కింపు
- పీలేరు అసెంబ్లీ : పోలైన పోస్టల్ బ్యాలెట్లు 4118, రెండు రౌండ్లలో లెక్కింపు
- మదనపల్లె అసెంబ్లీ : పోలైన పోస్టల్‌బ్యాలెట్లు 3587, మూడు రౌండ్లలో లెక్కింపు



కౌంటింగ్ కేంద్రంలో సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్



ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్

రాయచోటి టౌన్, జూన్3: రాయచోటి పట్టణంలోని శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మూడంచెల భద్రత మధ్య భారీ బందోబస్తుతో జరగనున్న ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను కలెక్టర్, జిల్లా అన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్ సోమవారం ఎన్నికల అబ్జర్వర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కౌంటింగ్ కేంద్రంలో వివిధ అంశాల్లో అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మొత్తం ఆరు అసెంబ్లీ ఒక లోక్‌సభ స్థానానికి జరగనున్న ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఆరు అసెంబ్లీలతో పాటు ఒక పార్లమెంట్ స్థానం కోసం ప్రతి నియోజకవర్గానికి రెండు చొప్పున మొత్తం 12 ఓట్ల లెక్కింపు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అలాగే రాజంపేట పార్లమెంట్ పరిధిలోని పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కోసం ప్రత్యేకంగా ఒక కౌంటింగ్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశారు. ప్రతి కౌంటింగ్ కేంద్రంలో 14 టేబుల్స్ చొప్పున ఏర్పాటు చేశారు. జిల్లాలోని 6 అసెంబ్లీలతో పాటు రాజంపేట పార్లమెంట్ సెగ్మెంట్ల ఈవీఎం ఓట్ల లెక్కింపు నిమిత్తం ప్రతి ఓట్ల లెక్కింపు కేంద్రంలో 14 టేబుల్స్ చొప్పున మొత్తం 12 చోట్ల లెక్కింపు కేంద్రాల్లో 168 టేబుల్స్ ఏర్పాటు చేశారు. అలాగే ఈవీఎం కౌంటింగ్‌లో ప్రతి టేబుల్‌కు ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఒక అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్, ఏజెంట్లు ఉంటారన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు ప్రతి టేబుల్‌కు 500 చొప్పున బ్యాలెట్ కేటాయిస్తారన్నారు. రాజంపేట పార్లమెంట్‌కు సంబంధించి మొత్తం పోలైన పోస్టల్ బ్యాలెట్లు (పుంగనూరు అసెంబ్లీతో కలిసి) 21,490 కాగా వీటి లెక్కింపు నిమిత్తం 20 టేబుళ్ల ఏర్పాటుతో పాటు రెండు రౌండ్ల లెక్కింపు ఉంటుందన్నారు. మంగళవారం ఉదయం 5 గంటలకు కౌంటింగ్ కేంద్రంలో సిబ్బందికి మూడో విడత ర్యాండమైజేషన్ ఉంటుందన్నారు. ఉదయం 6 గంటలకు అబ్జర్వర్లు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూములను తెరుస్తామన్నారు. ఉదయం 8 గంటలకు తొలుత పోస్టల్ బ్యాలెట్, అటు తరువాత 8.30 గంటలకు సాధారణ ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారన్నారు. మొదటగా వెలువడనున్న తంబళ్లపల్లె ఫలితాలు కాస్త ఆలస్యంగా, రైల్వేకోడూరు, మదనపల్లె ఫలితాలు ఆ తరువాత, పీలేరు, రాయచోటి, రాజంపేట ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉందన్నారు. ఓట్ల లెకికంపును ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని రకాల భద్రతా చర్యలతో విస్తృతంగా ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. అధికారులు, సిబ్బంది, రాజకీయ పార్టీల అభ్యర్థులు, ప్రతినిధులు, ఏజెంట్లు, కౌంటింగ్ ప్రక్రియలో నిమగ్నమయ్యే ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను పాటిస్తూ లెక్కింపు ప్రక్రియను విజయవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు.



కౌంటింగ్ జరగనున్న సాయి ఇంజనీరింగ్ కళాశాల ముఖద్వారం



కౌంటింగ్ కేంద్రానికి చేరుకుంటున్న సిబ్బంది



పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాటు చేసిన టేబుల్స్



కౌంటింగ్ కేంద్రంలో గస్తీ తిరుగుతున్న సాయుధ పోలీసులు



టమోటా @రూ.50

మదనపల్లె టౌన్, జూన్ 3: మదనపల్లె టమోటా మార్కెట్‌లో నాణ్యమైన టమోటా కిలో రూ.50 ధరకు చేరుకుంది. ఈ ఏడాది సీజన్‌లో ఇదే గరిష్ఠ ధరగా నమోదైంది. మదనపల్లె మార్కెట్‌కు రెండు నెలలుగా టమోటా విక్రయానికి వస్తున్నా సోమవారం పలికిన ధరలే గరిష్ఠంగా ఉన్నాయి. ఏప్రిల్, మే నెలల్లో మార్కెట్‌కు నిత్యం 300 నుంచి 400 టన్నులు మాత్రమే టమోటా విక్రయానికి రాగా అప్పట్లో టమోటా గరిష్ఠ ధర కిలో రూ.18 నుంచి కిలో రూ.44 వరకు పలికింది. కనిష్ఠంగా కిలో రూ.7 నుంచి రూ.24 వరకు ధరలు పలికాయి. కాగా గత వారం రోజులుగా మార్కెట్‌కు నిత్యం 600 నుంచి 750 మెట్రిక్ టన్నుల టమోటాలు విక్రయానికి వస్తుండగా ధరలు ఏమాత్రం తగ్గకుండా కిలో రూ.35 నుంచి పెరుగుతూనే ఉన్నాయి. ఈ సందర్భంగా సోమవారం మార్కెట్‌కు 623 మెట్రిక్ టన్నుల టమోటా విక్రయానికి రాగా మొదటిరకం టమోటా కనిష్ఠంగా కిలో రూ.40 పలుకగా గరిష్ఠంగా రూ.50 పలికింది. రెండోరకం టమోటా కనిష్ఠంగా కిలో రూ.30 పలుకగా గరిష్ఠంగా కిలో రూ.39 పలికింది. మొత్తం మీద ఈ ఏడాది టమోటా రైతులు లాభాలు చవిచూసే అవకాశాలు ఉన్నాయని వ్యాపారులు అంటున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

బి.కొత్తకోట, జూన్ 3: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందిన సంఘటన సోమవారం బి.కొత్తకోట మండలం గట్టు గ్రామంలో జరిగింది. గ్రామస్థుల కథనం మేరకు...గట్టు గ్రామానికి చెందిన రైతు రామస్వామి (65) కుటుంబానికి పాడి ఆవులు ఉన్నాయి. తరచూ ఆ ఆవులను తమ వ్యవసాయ పొలాల వైపు తోలుకుని వెళ్లేవాడు. యథా ప్రకారం సోమవారం కూడా తోలుకుని వెళ్లాడు. వాటిని మేపుకుని ఇంటికి తిరిగి వచ్చే సమయంలో మార్గమధ్యంలోని అయ్యవారితోట వద్ద కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు గొంతుభాగానికి తగులుకున్నాయి. దీంతో విద్యుత్ షాక్ తగిలి రామస్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇది గమనించిన పశువుల కాపర్లు మృతుడి కుటుంబీకులకు సమాచారం అందించారు. కుటుంబీకులు వెళ్లి మృతదేహం వద్ద భోరున విలపించారు. అయితే ఈ ఘటనపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిసింది.

దారులన్నీ రాయచోటి వైపే

- అనుమతి పొందిన 2 వేల మంది ఏజెంట్లు
- 100 మంది అధికారులు, సిబ్బంది



మదనపల్లె సబ్‌కలెక్టరేట్ నుంచి బస్సుల్లో రాయచోటికి బయలుదేరుతున్న కౌంటింగ్ సిబ్బంది

మదనపల్లె టౌన్, జూన్ 3: జిల్లా ప్రజలు, రాజకీయ పార్టీ నాయకులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసే రోజు రానే వచ్చింది. ఎన్నికల పోలింగ్ జరిగి 21 రోజులు క్షణమొక యుగంగా గడిచిన ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు, వారి ఏజెంట్లు, ముఖ్య కార్యకర్తలు ఒక్కసారిగా రాయచోటికి బయలుదేరారు. జిల్లాలో రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, తంబళ్లపల్లె, మదనపల్లె నియోజవర్గాలు ఉండగా ప్రధాన పార్టీల నుంచి 14 టేబుళ్లకు గాను 14 మంది కౌంటింగ్ ఏజెంట్లు, ఇద్దరు పోస్టల్ బ్యాలెట్ ఏజెంట్లు, మరో ఇద్దరు రిజర్వు ఏజెంట్లను నియమించుకున్నారు. మొత్తం మీద ఒక్కో పార్టీ 18 మంది ఏజెంట్లను ఒక జనరల్ ఏజెంట్‌ను నియమించుకున్నారు. వీరితో పాటు ప్రధాన పార్టీలు నిలిపిన ఇండిపెండెంట్ అభ్యర్థుల తరఫున ఏజెంట్లు కూడా రాయచోటికి పయనమయ్యారు. సోమవారం మధ్యాహ్నమే మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, రైల్వే కోడూరు, రాజంపేట నియోజకవర్గాల నుంచి ఒక్కో నియోజకవర్గం నుంచి ఎంత లేదన్నా 300 మంది ఏజెంట్లు (అన్ని పార్టీలు, స్వతంత్ర్య అభ్యర్థుల ఏజెంట్లు) ప్రత్యేక బస్సుల్లో రాయచోటికి బయలుదేరారు. సుమారు 2 వేల మంది ఏజెంట్లు రాయచోటికి పయనమైనట్లు సమాచారం. తెల్లవారుజామున 4 గంటల నుంచి 6 గంటల లోపు కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్న పార్టీల అధిష్ఠానం ఆదేశాలతో ఏజెంట్లకు రాయచోటిలోని ప్రైవేటు కల్యాణ మండపాల్లో రాత్రి బస ఏర్పాటు చేశారు. వీరితో పాటు ఈ ఐదు నియోజకవర్గాల నుంచి రిటర్నింగ్ అధికారుల తరఫున 100 మంది చొప్పున ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది కూడా ప్రత్యేక బస్సుల్లో రాయచోటికి బయలుదేరారు. దీంతో రాయచోటిలోని సాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పార్లమెంట్, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాల్లో రెండు వేల మందికి పైగా ఉదయం నుంచి సాయంత్రం వరకు కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొననున్నారు. దీంతో సోమవారం మధ్యాహ్నం నుంచి అన్ని వాహనాలు రాయచోటి వైపే పయనమయ్యాయి.

ప్రపంచ మోడలింగ్ పోటీల్లో మెరిసిన జిల్లా వాసి

- రైల్వేకోడూరుకు చెందిన అబూబకర్‌కు రెండో స్థానం



రైల్వేకోడూరు, జూన్ 3: ప్రపంచ మోడలింగ్ మిస్టర్ కాంటినెంటల్ పోటీల్లో రైల్వేకోడూరు పట్టణం గాంధీనగర్‌కు చెందిన సయ్యద్ అబూబకర్ రెండో స్థానం సాధించాడు. ఈ పోటీలను గత నెల 29 నుంచి ఈనెల 2వ తేదీ వరకు బ్యాంకాక్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో అబూబకర్ రెండో స్థానం సాధించి దేశానికి మంచిపేరు తీసుకుని వచ్చాడు. ఈ సందర్భంగా అబూబకర్ ఫోన్‌లో మాట్లాడుతూ ప్రపంచ పోటీల్లో పాల్గొని రెండో స్థానం సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మోడలింగ్‌ను ఒక హాబీగా తీసుకున్నట్లు తెలిపారు. మోడలింగ్ ప్రదర్శనలు, యాక్టింగ్‌ను స్ఫూర్తిగా తీసుకున్నానని తెలిపారు. ఐదేళ్లుగా తాను రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్నానని తెలిపారు. 2019లో రూబారు మిస్టర్ ఇండియాలో, 2023లో గ్లోబల్ మోడల్ ఇండియాలో గెలుపొందానని తెలిపారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తూ అందులో వచ్చిన డబ్బుతో కుటుంబానికి, మరికొంత మోడలింగ్, యాక్టింగ్‌కు ఖర్చు చేసుకుంటున్నానని తెలిపారు. ప్రపంచ స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో 17 దేశాల వారు పాల్గొన్నారని తెలిపారు. ప్రపంచ స్థాయి పోటీల్లో రెండో స్థానంలో నిలవడంతో కుటుంబ సభ్యులు ఆనందంలో మునిగిపోయారు.

ఇంటి యజమాని నిర్లక్ష్యంతో గోడకూలి వలంటీర్ మృతి

- ఇంటి యజమానితో పాటు మేస్త్రిపై కేసు నమోదు



మృతి చెందిన వలంటీర్ లక్ష్మిప్రసన్న

రాయచోటి టౌన్, జూన్ 3: రాయచోటి పట్టణంలోని మాసాపేట దేవాలయం వీధిలో ఇంటి యజమాని, ఆర్టీసీ కండక్టర్ మందల శ్రీనివాసులు నిర్లక్ష్యంతో గోడ కూలి నార్జాల లక్ష్మిప్రసన్న (35) అనే వలంటీర్ సోమవారం మధ్యాహ్నం మృతి చెందింది. బాధితుల కథనం మేరకు వివరాల్లోకి వెళితే... మున్సిపాలిటీ పరిధిలోని మాసాపేట-2 వార్డు కౌన్సిలర్ పద్మావతి ఆడబిడ్డ, వైసీపీ నేత సుగవాసి శ్యామ్‌కుమార్ బావ మందల శ్రీనివాసులు ఇంటి నిర్మాణం చేపడుతుండగా మూడవ అంతస్తుపై నుంచి గోడకూలి మార్జాల లక్ష్మిప్రసన్న (35) మృత్యువాత పడింది. ఈమె వార్డులో వలంటీర్‌గా పనిచేస్తోంది. ఈమెకు భర్త, కుమారుడు ఉన్నారు. మున్సిపాలిటీ నిబంధనలకు విరుద్ధంగా మూడు సంవత్సరాలుగా ఇంటి నిర్మాణం చేపడుతున్న విషయంపై పలుమార్లు వారు హెచ్చరించినప్పటికీ లెక్కచేయకుండా కౌన్సిలర్ అండదండలతో నిర్మాణం చేపట్టడంతో గోడకూలి అన్యాయంగా చనిపోయింది అంటూ లక్ష్మీప్రసన్న కుటుంబ సభ్యులు, భర్త, కుమారుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు రాయచోటి ఏరి యా ఆసుప్రతికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఇంటి యజమాని మందల శ్రీనివాసులు, మేస్త్రీపైన కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.



మీడియాకు వివరాలు తెలుపుతున్న మృతురాలి కుటుంబ సభ్యులు

అంతర పంటలతో అధిక ఆదాయం

లాభాలు గడిస్తున్న రైతులు


మామిడితోటలో పనస చెట్లను సాగు చేసిన దృశ్యం

రాజంపేట, జూన్ 3 : అన్నదాతలు ఇటీవల ఎక్కువగా అంతర్ పంటల వైపు ఎక్కువ మక్కువ చూపుతున్నారు. ఉద్యానవన భూముల్లో స్వల్పకాలిక పంటలను సాగు చేస్తున్నారు. దీర్ఘకాలికంగా ఆదాయాన్ని ఇచ్చే ఉద్యానవనాల్లో ఎక్కువ ఆదాయం లేకపోవడంతో రైతులు అంతర్ పంటల వైపు మొగ్గుచూపుతున్నారు. మామిడి, నిమ్మలాంటి ఉద్యానవన పంటల్లో నూగు, సజ్జ, పసుపు, అరటి, ఆకుతోటలు, బొప్పాయి పంటలను పండిస్తున్నారు. దీని వల్ల రెండు రకాల ఆదాయం రైతులకు లభిస్తోంది. రాజంపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని రాజంపేట, చిట్వేలి, రైల్వేకోడూరు, పెనగలూరు, నందలూరు, ఒంటిమిట్ట, సిద్ధవటం, సుండుపల్లె, వీరబల్లి తదితర ప్రాంతాల్లో అనేక గ్రామాల్లో అంతర్ పంటల సాగు ఎక్కువైంది. మామూలుగా మామిడి నాటిన తరువాత 5 సంవత్సరాల తరువాతనే చెట్లు పెద్దవై.. కాయలు కాస్తాయి. అప్పటి వరకు ఆ తోటల్లో రైతులకు ఎటువంటి ఆదాయం ఉండదు. మామిడి నుంచి పూర్తి స్థాయి ఆదాయం రావాలంటే కనీసం చెట్లకు 8 సంవత్సరాలు వయసు నిండాల్సి ఉంది. అప్పటి వరకు సరైన పంట అందదు. ఈ సమయంలో అక్కడ రైతుకు ఎటువంటి ఆదాయం ఉండదు. ఏడాది పొడవునా ఎకరాకు కనీసం 10 వేల రూపాయలు ఖర్చు అవుతుంది. ఆ చెట్లను పెంచుకోవడానికి దున్నకాల ఖర్చులు, ఎరువుల ఖర్చులు, మందుల పిచికారీ ఖర్చులు ఇతరత్రా అనేక ఖర్చులు తడిసిమోపెడవుతాయి. అయితే ఒక్క పైసా ఆదాయం ఉండదు. 8 సంవత్సరాలు వచ్చే వరకు చెట్ల నుంచి పూర్తి స్థాయి పంట రాదు. అంత వరకు ఆదాయం లేనందున రైతులు ఆ పొలాల్లో పసుపు, నూగు, బొప్పాయి, ఆకుతోట, అరటి, పూలతోటలు తదితర పంటలను విరివిగా సాగు చేస్తున్నారు. దీనివల్ల రైతులకు పెట్టిన ఖర్చులు పోనూ ఎకరాకు 30 వేల రూపాయల వరకు ఆదాయాన్ని గడిస్తున్నారు. దీనివల్ల రైతులకు కొంత మేలు జరుగుతోంది. రాజంపేట డివిజన్‌లో సుమారు 5 వేల ఎకరాల్లో అంతర్ పంటల సాగు జరుగుతున్నట్లు వ్యవసాయాధికారులు తెలియజేస్తున్నారు.


మామిడి తోటలో బొప్పాయి సాగు


మామిడిలో అంతర్‌పంటగా నువ్వుల సాగు


మామిడి, జామ, పనస, దానిమ్మ చెట్ల సాగు

అన్నకు తోడుగా ఈతకు వెళ్లి నీటికుంటలో పడి బాలుడి మృతి



బాలుడి మృతదేహాన్ని వెలికితీసుకువస్తున్న ఫైర్ సిబ్బంది, మృతి చెందిన బాలుడు భీమా

బద్వేలు టౌన్, జూన్ 3: అన్నకు తోడుగా సరదాగా ఈతకు వెళ్లిన తమ్ముడు ముళ్లపాటి భీమా(10) ప్రమాదవశాత్తు నీటికుంటలో జారిపడి మృతి చెందాడు. ఈ ఘటన ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. బంధువుల వివరాల మేరకు... బద్వేలు పట్టణంలోని సాయినగర్‌కు చెందిన శ్రీనివాసులు, నాగ లక్షుమ్మ దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు సంతానం. శ్రీనివాసులు ఉపాధి నిమిత్తం తెలంగాణా రాష్ట్రంలో బెల్దారిపనికి వెళ్లాడు. తల్లి మేకలు కాచుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఈ తరుణంలో ఇద్దరు కుమారులు శేషాద్రి, భీమా పట్టణంలోని నూతన ఆర్డీఓ కార్యాలయం భవన నిర్మాణం వెనుకవైపు ఉన్న నీటికుంటలోకి సరదాగా ఈతకు వెళ్లారు. అన్నకు తోడుగా వెళ్లిన తమ్ముడు భీమాకు ఈతరాని కారణంగా గట్టుపై ఉండగా.. ప్రమాదవశాత్తు కాలుజారి నీటికుంటలో పడ్డాడు. దీంతో అన్న శేషాద్రి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్న స్థానికులు గమనించి అక్కడకు చేరుకున్నారు. అయితే బాలుడి ఆచూకీ లభించక పోవడంతో పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే ఫైర్ సిబ్బంది పోలీసులు అక్కడకు చేరుకుని నీటికుంటలో బాలుడి కోసం గాలింపు చర్యలు చేపట్టి శవాన్ని వెలికితీశారు. అనంతరం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కిడ్నాప్ కేసును ఛేదించిన పోలీసులు


కిడ్నాపర్లను చూపుతున్న పోలీసులు

మైదుకూరు, జూన్ 3: మండలంలోని జీవి సత్రంకు చెందిన అవిరేని సంతోష్ అనే వ్యక్తిని ఆదివారం సాయంత్రం కొందరు వ్యక్తులు వాహనంలో వచ్చి కిడ్నాప్ చేశారు. పోలీసులు రంగంలోకి దిగి ఈ కేసును ఛేదించారు. వివరాల్లోకి వెళితే... కిడ్నాప్ చేసిన వ్యక్తులు సంతోష్ అన్న శివకు ఫోన్ చేసి మీ తమ్ముడు వీసా పంపిస్తానంటూ మోసం చేసి రూ.3లక్షలు తీసుకున్నాడని, వెంటనే డబ్బులు ఇస్తే వదిలి పెడతామంటూ తెలిపారు. దీంతో సంతోష్ తండ్రి శ్రీనివాసులు మైదు కూరు అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆదేశాలతో సీఐ మస్తాన్, ఎస్ఐలు రాజరాజేశ్వరరెడ్డి, దువ్వూరు ఎస్ఐ శ్రీనివా సులు కిడ్నాపర్ల కోసం గాలింపు చేపట్టారు. ఈనేపథ్యంలో దువ్వూరు బైపాస్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన దుర్గారెడ్డి, వెంకటేశ్వర్లుతో పాటు 8 మందిని అదుపులోకి తీసుకుని విచారించి.. కిడ్నాపర్ల బారి నుంచి సంతోష్‌ను విడిపించారు. కాగా కేసును ఛేదించడంలో ప్రతిభ చూపిన పోలీసులను ఎస్పీ సిద్ధార్థ కౌశిల్ అభినందించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై వేటు

- హెడ్‌కానిస్టేబుల్ సస్పెన్షన్
- సీఐ, ఎస్ఐలకు చార్జి మెమోలు

కడప (క్రైం), జూన్ 3: పెద్దముడియం పరిధిలో నిర్లక్ష్యం వహించిన పోలీసు సిబ్బందిపై వేటు వేస్తూ ఎస్పీ సిద్ధార్థ కౌశల్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తుంది. హౌస్ అరెస్టులో ఉన్న ఇరువురిని వదిలి వేయడంతో వారు బయట యథేచ్ఛగా తిరుగుతున్నట్లు తెలియడంతో హెడ్ కానిస్టేబుల్ మల్లారెడ్డిని సస్పెండ్ చేశారు. అలాగే ఎస్ఐ రామక్రిష్ణ, జమ్మలమడుగు రూరల్ సీఐ గోపాల్‌రెడ్డిలకు చార్జి మెమోలు, జమ్మలమడుగు డీఎస్పీ యశ్వంత్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.

మద్యంషాపులు సీజ్



మద్యంషాపులోను సీజ్ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

కడప (క్రైం), జూన్ 3: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ మద్యం షాపులు బార్లు, రెస్టారెంట్లను సీజ్ చేశారు. ఎక్సైజ్ అధికారులు తమ సిబ్బందితో మద్యంషాపులను సీజ్ చేసి... షాపుల వద్ద బార్ల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల కౌంటింగ్ అనంతరం 5వ తేదీ మద్యం దుకాణాల్లో విక్రయాలు యదావిధిగా కొనసాగుతాయని తెలిపారు.

బాలికకు తీవ్రగాయాలు

నిమ్మనపల్లి, జూన్ 3: నిమ్మనపల్లి మండలం రాచవేటివారిపల్లికి చెందిన శ్రీనివాసులు కుమార్తె జి.వైష్ణవి(13) ఇంటి వద్ద ఆడుకుంటూ విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన స్టేవైరు తాకడంతో షాక్‌కు గురై తీవ్రంగా గాయపడింది. గమనించిన కుంటీకులు వెంటనే బాలికను 108 సాయంతో మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

భర్త వేధింపులతోనే వేదవతి ఆత్మహత్య

- మృతురాలి తల్లిదండ్రుల ఆరోపణ
- దస్తగిరికి దేహశుద్ధి చేసిన మహిళలు
- భీమగానిపల్లెలో పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు


వేదవతి అంత్యక్రియల్లో గాలిలోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు

పుంగనూరు, జూన్ 3: భర్త దస్తగిరి వేధింపులతోనే తమ బిడ్డ వేదవతి ఆత్మహత్య చేసుకుందని తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీసు జిల్లా కార్యాలయంలో ఆదివారం సాయంత్రం గన్‌తో కాల్చుకుని మహిళా కానిస్టేబుల్ వేదవతి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. రాయచోటి ఏరియా ఆస్పత్రి నుంచి ఆమె మృతదేహాన్ని తల్లిదండ్రులు గంగాధర్, రాఘవమ్మ, పోలీసులు పుంగనూరు మండలం భీమగానిపల్లెకి సోమవారం మధ్యాహ్నం తీసుకొచ్చారు. మృతురాలి భర్త దస్తగిరి కూడా రావడంతో గ్రామంలోని మహిళలు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్యాయంగా తమ బిడ్డను పొట్టనపెట్టుకుని పసిబిడ్డను అనాథను చేశావంటూ దేహశుద్ధి చేశారు. వేదవతి కుమార్తె షహీనా(5)ను అంత్యక్రియలకు తీసుకురాకుండా మదనపల్లెలోని దస్తగిరి అమ్మవద్ద విడిచి రావడంపై ఆగ్రహించారు. తమకు బిడ్డను అప్పగించే వరకు అంత్యక్రియలు చేయబోమని భీష్మించారు.

భర్త కొట్టడం, హింసించడం వల్లే తమ బిడ్డ చనిపోయిందని, వేదవతి ఉద్యోగం భర్తకు ఇవ్వొద్దని, పసిబిడ్డను తమకు అప్పగించాలని రాయచోటి నుంచి వచ్చిన ఏఆర్ డీఎస్పీ, పోలీసులను కోరారు. వివాహం చేసుకునేటప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని, ఇప్పుడు మాట్లాడితే ప్రయోజనం ఏమిటని, ముందే జాగ్రత్తలు తీసుకుని ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని పోలీసులు సర్దిచెప్పారు. మదనపల్లెనుంచి షహీనాను పోలీసులు తీసుకొచ్చారు. గంగాధర్ ఇంటి వద్ద పోలీసులు వేదవతి మృతదేహానికి గౌరవవందనం చేసి పూలమాలలతో నివాళులర్పించారు. 'కూలిపనులు చేసి వేదవతిని చదివించాం. పుంగనూరులో 9 నెలలు కోచింగ్‌కు పంపితే ముందే పెళ్లి చేసుకుని బిడ్డలున్న వ్యక్తి మాటలకు మోసపోయి జీవితం నాశనం చేసుకుంది. చాలా మంచోడని వెళ్లింది. అతడికి ముందే పెళ్లయిన విషయం తెలిసి సంవత్సరం తర్వాత ఫోన్ చేసింది ఏడ్చింది. భార్య జీతం, లోన్లు తింటూ నరకం చూపించాడు. మూడునెలల క్రితం ఫోన్‌చేసి నన్ను కొడుతున్నాడని, చాలా ఇబ్బందిపడుతున్నానని, నేను వచ్చేస్తానని చెబితే వచ్చేయమన్నాం. పెళ్లి కావాల్సిన సోదరికి ఇబ్బందని ఆలోచించి పుట్టింటికి రాకుండా ఇబ్బంది పడింది. గతంలో ఒకసారి మావద్దకు వచ్చినందుకు దస్తగిరి గొడవ చేశాడు. రాయచోటిలో వేదవతి శవాన్ని కూడా ఇవ్వమని చెప్పారు. మేము ఒక్క రూపాయి జీతం కూడా తినలేదు. బిడ్డకు టెంకాయ కొట్టుకునేందుకు తీసుకెళతామని పట్టుబడితే ఇచ్చారు' అంటూ తల్లి రాఘవమ్మ రోదించారు. వివిధ గ్రామాలకు చెందిన మహిళలు, ప్రజలు అధిక సంఖ్యలో అంత్యక్రియల్లో పాల్గొన్నారు. శ్మశానం వద్ద రాయచోటి పోలీసులు మరోసారి వేదవతి మృతదేహానికి గౌరవవందనం చేసి, గాలిలోకి మూడురౌండ్ల కాల్పులు జరిపి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిపించారు. కాగా, వేదవతి భర్త దస్తగిరికి గ్రామస్తులు దేహశుద్ధి చేయడంతో అతడు అంత్యక్రియల్లో పాల్గొనకుండా వెళ్లిపోయాడు.

ట్రాక్టర్ బోల్తా... వ్యక్తి మృతి


ఆంజనేయులు(ఫైల్‌ఫొటో)

కొండాపురం, జూన్ 3: మండలంలోని వెంకయ్యకాలువ వద్ద ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటనలో ఆంజనేయులు(43) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... అనంతపురం జిల్లా యల్లనూరు గ్రామానికి చెందిన ఆంజనేయులు యల్లనూరులో కట్టెల లోడు అన్‌లోడ్ చేసి ట్రాక్టర్ డ్రైవింగ్ చేస్తూ వస్తుండగా వెంకయ్య కాలువ సమీపంలోకి రాగానే ఎదురుగా బొలెరో వాహనం వచ్చింది. దాన్ని తప్పించే ప్రయత్నంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఆంజనేయులు ట్రాక్టర్ ఇంజన్, ట్రాలీ మధ్యలో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యోగీంద్ర తెలిపారు.

కల్వర్టును ఢీ కొని స్కూటరిస్టు మృతి


మృతి చెందిన అన్నమయ్య

పుల్లంపేట, జూన్ 3: మండల పరిధిలోని పుత్తనవారిపల్లె మలుపు వద్ద కడప-చెన్నై రహదారిలో సోమవారం సాయంత్రం బైకుపై వస్తున్న యువకుడు కల్వర్టును ఢీకొని మృతి చెందాడు. కోడూరు మండలం అనంతరాజుపేట అరుంధతీవాడకు చెందిన అన్నమయ్య (25) నెల క్రితం కువైట్ నుంచి వచ్చాడు. సోమవారం రాజంపేట నుంచి తిరిగి ఇంటికి బయలు దేరాడు. తన గ్రామానికి చెందిన పరశరామున్ని ఎక్కించుకుని పల్సర్ బైక్‌పై వస్తూ పుత్తనవారిపల్లెకు రాగానే బైక్ అదుపు తప్పి కల్వర్టు పైకి ఎక్కించాడు. దీంతో పరశురాముడు పక్కకు పడిపోగా అన్నమయ్య రాతిపై పడటంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజంపేటకు తరలించినట్లు పుల్లంపేట పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామని వారు తెలిపారు.

యువకుడికి తీవ్రగాయాలు

బి.కొత్తకోట, జూన్3: బి.కొత్తకోట మండలంలోని బడికాయలపల్లె గ్రామానికి చెందిన శివశంకర్ అనే వ్యక్తి విద్యుత్ షాక్ తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. తన ఇంటికి గత రెండురోజులుగా విద్యుత్ సరఫరా కాలేదని స్వయంగా విద్యుత్ పని చేస్తుండగా షాక్‌కు గురై కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబీకులు శివశంకర్‌ను ప్రైవేటు వాహనంలో మదనపల్లెకు తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం అక్కడి వైద్యులు మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు.

23 దుంగలు స్వాధీనం ముగ్గురు నిందితుల అరెస్టు

వాల్మీకిపురం, జూన్ 3: అన్నమయ్య జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వాల్మీకిపురం పోలీసులు సోమవారం దాడులు చేసి 23 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ పులిశేఖర్ తెలిపారు. సీఐ కథనం మేరకు..వాల్మీకిపురం మండలం కూరపర్తి గ్రామానికి చెందిన అన్నదమ్ములు పట్నం లక్ష్మణాచారి(35), పట్నం శ్రీరాములుఆచారి (30), తిరుపతి జిల్లా ముత్యాలరెడ్డిపల్లెకు చెందిన పి.పవన్ కుమార్(34)లు ముగ్గురు కలిసి దుంగలను అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. సుండుపల్లె సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి ఎర్రచందనం దుంగలను ఏపీ05 బీహెచ్2727 కారులో తరలిస్తూ మరో కేఏ03ఎంహెచ్1769 కారును పైలెట్ వాహనంగా పెట్టుకుని సోమవారం వేకువజా మున మండలంలోని చింతపర్తి-నిమ్మనపల్లె రోడ్డుగుండా బెంగ ళూరు ప్రాంతానికి రవాణా చేస్తుండగా తనతోపాటు ఎస్ఐ నాగేశ్వర్‌రావు, సిబ్బంది వాహనాలను వెంబడించి దాడి చేసి పట్టుకున్నామన్నారు. ఈ దాడులలో 23 ఎర్రచందనం దుంగలు, రెండు వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. వాహనాల సహా మొత్తం రూ.32 లక్షల విలువైన ఎర్ర చందనం పట్టుబడినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి నిందితు లను రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరు పరిచారు. కాగా పట్నం లక్ష్మణాచారి, పవన్ కుమార్‌లు ఇరువురు గతకొద్దినెలల క్రితం కుప్పంలో ఎర్రచందనం తరలిస్తూ పట్టుబడడం గమనార్హం. ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకున్న సీఐ, ఎస్ఐ, సిబ్బందిని జిల్లా ఎస్పీ, డీఎస్పీలు అభి నందించారు.

రెండు ట్రాక్టర్లు సీజ్

మదనపల్లె అర్బన్, జూన్3: స్థానిక బెంగళూరు రోడ్డు సమీపం లోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు సెబ్ సీఐ రమేష్‌రెడ్డి తెలిపారు. సోమవారం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో అక్రమంగా ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో తమ సిబ్బందితో కలిసి వెళ్లి అక్కడే రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నాలుగు రోజుల క్రితం సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్‌చేసి తాలుకా స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసిన సంఘటన మరువక ముందే ఇలా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసి జరిమానా విధించడం విశేషం. ఈ సందర్భంగా సెబ్ సీఐ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో, వంకల్లో, వాగుల్లో, గుట్టల్లో అక్రమంగా మట్టిని, ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సౌత్‌జోన్ క్రికెట్ టోర్నీ విజేత కడప


విజేతగా నిలిచిన కడప జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 3: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ అండర్-19 వన్డే క్రికెట్ పోటీల్లో కడప జట్టు విజేతగా నిలిచింది. సోమవారం స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో ఈ పోటీలు కొనసాగాయి. అనంతపురం, కడప జట్ల మధ్య మ్యాచ్ జరగగా... మొదట బ్యాటింగ్ చేసిన అనంతపురం 24 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 143 పరుగులు మాత్రమే చేసింది. అనంతరం స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన కడప 23.2 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 144 పరుగులు సాధించింది. దీంతో కడప మూడు వికెట్ల తేడాతో గెలిచింది. గురు విగ్నేష్ 90 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. మరో మ్యాచ్‌లో... చిత్తూరు, కర్నూలు జట్లు తలపడగా.. మొదట బ్యాటింగ్ చేసిన చిత్తూరు 26 ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయి 198 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన కర్నూలు 26 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసింది. చిత్తూరు జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన 88 పరుగులు సాధించిన లక్ష్మీనారాయణ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. పాయింట్ల ఆధారంగా కడప జట్టును టోర్నీ విజేతగా నిలిచింది. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి, కోచ్‌లు, సభ్యులు పాల్గొన్నారు.

కడప జట్టుపై కర్నూలు, నెల్లూరుపై అనంతపురం జట్ల విజయం




సాయి సూర్యతేజ (72 పరుగులు), సెంచరీ చేసిన గిరినాథ్‌రెడ్డి

కడప (స్పోర్ట్స్) జూన్ 3 : కడపలో జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ వన్డే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా సోమవారం కడప జట్టుపై కర్నూలు జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించగా, మరో మ్యాచ్‌లో నెల్లూరు జట్టుపై అనంతపురం జట్టు ఒక్క వికెట్ తేడాతో విజయకేతనం ఎగురవేసింది. నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో సోమవారం కడప-కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత టాస్ నెగ్గిన కడప జట్టు బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 50 ఓవర్లలో 43.3 ఓవర్లపాటు బ్యాటింగ్ చేసి కేవలం 136 పరుగుల స్వల్ప స్కోర్‌కే ఆలౌట్ అయ్యింది. ఇందులో వంశీకృష్ణ 36 పరుగులు సాధించగా, మిగతా బ్యాట్స్‌మెన్ చేతులెత్తేశారు. తదుపరి విజయమే ధ్యేయంగా బరిలోకి దిగిన కర్నూలు జట్టు 27.3 ఓవర్లలో కేవలం 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 138 పరుగులు చేసింది. ఇందులో సాయి సూర్యతేజ 72 పరుగులు చేసి విజయంలో కీలకంగా నిలిచారు. దీంతో కర్నూలు జట్టు 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. అలాగే కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో అనంతపురం-నెల్లూరు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో తొలుత టాస్ నెగ్గిన అనంతపురం జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 34.1 ఓవర్లలోనే ఆలౌట్ అయ్యి 195 పరుగులు చేసింది. ఇందులో మాధవ్ 70 పరుగులు చేశారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 33.3 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 196 పరుగులు సాధించి విజయపతాకాన్ని ఎగుర వేసింది. ఇందులో గిరినాథ్‌రెడ్డి 100 పరుగులు (77బంతులు) చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు.

చెస్‌లో సత్తా చాటిన కడప చిన్నారి


తృతీయ బహుమతి అందుకుంటున్న అమీనా

కడప (స్పోర్ట్స్) జూన్ 3 : గుంటూరులో ఈనెల 2వ తేదీ ఆదివారం నిర్వహించిన ఉమ్మడి రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో కడప నగరానికి చెందిన చిన్నారి అమీనా అండర్-9 బాలికల విభాగంలో తృతీయ స్థానం సాధించింది. ఏడు రౌండ్లకు గాను మూడు పాయింట్లు సాధించి ఆ ఘనత సాధించింది. దీంతో ఏపీ చెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి సుమన్ చేతుల మీదుగా ట్రోఫీని అందుకుంది.

వైభవంగా నల్లవీరగంగాభవానీ ఊంజల్‌సేవ

వాల్మీకిపురం, జూన్ 3: వాల్మీకిపురం పట్టణం రైల్వేస్టేషన్ సమీపంలో వెలసిన నల్లవీరగంగాభవానీ అమ్మవారి ఆలయంలో ఊంజల్‌సేవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. సోమవారం ఉదయం ఆలయంలో అమ్మవారికి అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం అమ్మవారికి విశేషాలంకరణలు గావించి భక్తజనం నడుమ ఊంజల్‌సేవ కన్నుల పండువగా సాగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమాలలో ఆలయ ధర్మకర్త రమణా రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ మొర్రంరెడ్డి రామ్‌కుమార్ రెడ్డి, అర్చకులు జనార్దనస్వామి, సభ్యులు ఆనందశెట్టి, బలరామ్, తదితరులు పాల్గొన్నారు.

మండలంలో 144 సెక్షన్ అమలు

● కౌంటింగ్ దృష్ట్యా ఆంక్షలు కఠినం ● ఎస్ఐ వెంకటప్రసాద్



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటప్రసాద్

గాలివీడు, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా మంగళవారం మండలంలో 144 సెక్షన్ పక్కాగా అమలు చేయనున్నట్లు గాలివీడు ఎస్ఐ వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు ఎవ్వరూ రాకూడదన్నారు. నలుగురు కంటే ఎక్కువ మంది ఒకే చోట గుమికూడవద్దని, బాణాసంచా పేలిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. రాయచోటి కౌంటింగ్ కేంద్రం వద్దకు కేవలం పాసులు అనుమతి కలిగిన వారికి మాత్రమే ప్రవేశం ఉంటుందని, ఇతరులెవ్వరూ అక్కడికి వెళ్లరాదన్నారు. సీసీ కెమెరాలతో మండలమంతా నిఘా ఉంచామని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోషల్ మీడియాలో కూడా ఇతర పార్టీలను రెచ్చగొట్టే వాఖ్యలు చేయరాదని హెచ్చరించారు. గెలుపోటములతో సంబంధం లేకుండా అందరూ సమన్వయంతో వ్యవహరించాలని తెలిపారు.

వీరభద్రస్వామి ఆలయంలో మండిపల్లి ప్రత్యేక పూజలు



దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, జూన్ 3: రాయచోటిలో, రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ అభ్యర్థులు విజయకేతనం ఎగురవేసి, స్వర్ణాంధ్ర సృష్టికర్త చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని వీరభద్రస్వామిని కోరుకున్నానని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం దక్షిణ కాశీగా పేరుగాంచిన భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ అధినేత సారథ్యంలో ఆ భగవంతుని కృపతో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని, సకాల వర్షాలతో పంటలతో రాష్ట్రం సస్యశ్యామలంగా విరజిల్లాలని కోరుకున్నానని తెలిపారు. అలాగే రాయచోటి పట్టణంలోని పాతరాయచోటిలో గల శ్రీహజరత్ జమాలుల్లా బాషా సాహెబ్ దర్గాలోనూ ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

నాణ్యత లేని విత్తనాలు వెనక్కి పంపండి



వేరుశనగ విత్తనకాయల నాణ్యతను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

చిన్నమండెం, జూన్ 3: నాణ్యత లేని వేరుశనగ విత్తనాలను వెనక్కి పంపాలని జిల్లా వ్యవసాయాధికారి బి.చంద్రానాయక్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రం-1లో పంపిణీ చేస్తున్న వేరుశనగ విత్తనకాయలను ఆయన పరిశీలించారు. విత్తన నాణ్యతలో ఎలాంటి రాజీపడవద్దని, నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించాలని ఆయన సిబ్బందికి సూచించారు. 74 శాతం సీలింగ్ పర్సంటేజ్ కంటే తక్కువ ఉంటే తిప్పి పంపాలని వ్యవసాయాధికారులకు సూచించారు. రైతుల దగ్గర నుంచి నాణ్యత పరమైన ఫిర్యాదులు రాకుండా చూడాలని, అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వేరుశనగ కాయలు తీసుకున్న ప్రతి రైతు విత్తనకాయలను ఉపయోగించుకోవాలని కోరారు. ప్రతి రైతుకు ఈ క్రాప్ చేయించే బాధ్యత సిబ్బంది తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవోలు గీత, రమేశ్ రాజు, ఏఈవో బ్లెస్సీ, రైతులు పాల్గొన్నారు.

'గిరిజనుల భూములను ఆన్‌లైన్ చేయాలి'



గిరిజనుల భూముల వద్ద మాట్లాడుతున్న రాజశేఖర్

రైల్వేకోడూరు, జూన్ 3: సమతానగర్ గిరిజనుల భూములకు ఆన్‌లైన్ చేయించాలని రైల్వేకోడూరు సీపీఐ మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్ తెలిపారు. సోమవారం రైల్వేకోడూరు మండలంలోని కె.బుడుగుంటపల్లె గ్రామ పంచాయితీలో ఉన్న సమతానగర్ గిరిజనులకు చెందిన భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1992లో భూములు చూపించి, పట్టాలు ఇచ్చారని, అయితే ఆన్‌లైన్ చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. 120 ఎకరాల భూమిని 60 కుటుంబాలకు అప్పటి ప్రభుత్వం ఇచ్చిందని, 1992లో సర్వే చేయించి భూములను చూపించారన్నారు. అయితే వాటిని ఇంత వరకు ఆన్‌లైన్ కూడా చేయలేదన్నారు. గిరిజనులకు న్యాయం చేయకపోతే రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళనలకు దిగుతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి మొగిలి వినయ్, సమతానగర్ గిరిజనులు నరిగిపాటి సుబ్బమ్మ, నగిరిపాటి గంగమ్మ, ప్రొద్దుటూరు అంకమ్మ, ఉయ్యాల సుబ్బమ్మ, మేకల బత్తయ్య, పాలెంకోట వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సయ్యద్ అహ్మాద్‌కు సేవారత్న పురస్కారం

సుండుపల్లె, జూన్ 3: మండలానికి చెందిన సంఘ సేవకుడు సయ్యద్ అహ్మాద్ సేవారత్న పురస్కారం అందుకున్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాదులో మాతృదేవోభవ అనాథాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు గట్టుగిరి.. తెలంగాణ ఆవిర్భవించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా పలు రంగాల్లో విశిష్ట ప్రతిభ కనపర్చిన వారికి అవార్డులు ప్రదానం చేశారు. ఇందులో భాగంగా అహ్మాద్‌కు ఉమ్మడి ఏపీ మాజీ హోంమంత్రి, ప్రస్తుత తెరాస మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా అవార్డు అందజేశారు.

ప్రధాన పార్టీల్లో హైటెన్షన్

● బెట్టింగురాయుళ్లలో పెరిగిన బీపీ
● ప్రజల్లో తీవ్ర ఉత్కంఠ
● పోలీసుల పహారాలో సమస్యాత్మక గ్రామాలు
● అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల పహారా



రాజంపేట, జూన్ 3: కొన్ని గంటల్లో కౌంటింగ్ ప్రారంభంకానున్న నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీల నేతలకు హైటెన్షన్ పట్టుకుంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు, నియోజకవర్గాల నాయకులు, మండల నాయకులు, కార్యకర్తల్లో హై బీపీ పట్టుకుంది. విజేత ఎవరో తేలనుండడంతో ప్రతి ఒక్కరిలో ఆందోళన మొదలైంది. రాజంపేట నాయకులు జిల్లా కేంద్రమైన రాయచోటికి సోమవారం సాయంత్రానికి తరలివెళ్లారు. ప్రధాన రాజకీయ పక్షాలకు సంబంధించిన ఏజెంట్లంతా రాయచోటికి చేరారు. రాజంపేట, కోడూరుకు చెందిన వైసీపీ, టీడీపీ, బీజేపీ, స్వతంత్ర పార్టీల అభ్యర్థులు రాయచోటిలో మకాం వేశారు. నాయకులు, అభ్యర్థులు ఏజెంట్లను అప్రమత్తం చేశారు. కౌంటింగ్ సెంటర్ సమస్యలపై చర్చించుకున్నారు. ప్రత్యర్థి పార్టీల ఏజెంట్ల కదలికలపై వారు చేసే ఎత్తుగడలపై చర్చించారు. టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, వైసీపీ అభ్యర్థి అమర్‌నాథ్‌రెడ్డిలకు సంబంధించిన ఏజెంట్లంతా రాయచోటి చేరుకుని కౌంటింగ్‌పై చర్చించుకున్నారు. సుగవాసి బాలసుబ్రమణ్యం స్వగ్రామం రాయచోటి అయినందున అక్కడే నాయకులకు, ఏజెంట్లకు వసతి గృహాలను ఏర్పాటు చేశారు. వైసీపీ అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి కూడా రాయచోటికి చేరుకుని ఎన్నికల కౌంటింగ్‌పై చర్చలు జరిపారు. ఇక రైల్వేకోడూరు జనసేన అభ్యర్థి శ్రీధర్, వైసీపీ అభ్యర్థి కొరముట్ల శ్రీనివాసులు రాయచోటిలో మకాం వేశారు. ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఏజెంట్లు సోమవారం ముధ్యాహ్నానికి రాయచోటికి చేరారు. కౌంటింగ్‌లో తీసుకోవాల్సిన చర్యలపై ఏజెంట్లకు ఒకటికి పదిసార్లు తర్ఫీదు ఇచ్చారు. అదే విధంగా కోడూరు, రాజంపేటలోనూ అభ్యర్థులు ఎవరు గెలుస్తారన్న అంశంపై సుమారు రూ.100 కోట్లకు పైబడి బెట్టింగులు పెట్టారు. బెట్టింగు రాయుళ్ల కౌంటింగ్ సమయం రావడంతో హైటెన్షన్‌లో వున్నారు. లక్ష నుంచి కోట్ల రూపాయల వరకు బెట్టింగు పెట్టిన వారు సుమారు వెయ్యి మంది వరకు రెండు నియోజకవర్గాల్లో వున్నారు. కొన్ని మండలాల్లో మెజార్టీ ఫలానా పార్టీకి వస్తుందని, ఇంత మెజార్టీలో గెలుస్తామని రకరకాలుగా బెట్టింగులు పెట్టారు. ఒకరు విజేత అయితే వారి తరఫున బెట్టింగు పెట్టిన వారికి పెద్ద ఎత్తున సొమ్ము వస్తుంది. లేదంటే పెట్టిన డబ్బంతా బూడిదలో పోసిన పన్నీరు అవుతుంది.

రెండు నియోజకవర్గాల్లో ఉత్కంఠ !

విజేత ఎవరో మంగళవారం మధ్యాహ్నానికి తేలడంతో ప్రజల్లో, రాయకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. తాము ఓటు వేసిన వారు గెలుస్తారా, లేక ఇతరులు గెలుస్తారా, ఎంత మెజార్టీతో గెలుస్తారన్న దానిపై సర్వత్రా చర్చనీయాంశమైంది.

అల్లర్లు జరగకుండా పోలీసులు అప్రమత్తం

హోరాహోరీగా జరిగిన ఎన్నికల్లో విజేతలు ఎవరో కొన్ని గంటల్లో తేలనుండడంతో ప్రత్యర్థుల నుంచి ఎక్కడ అల్లర్లు వస్తాయోనన్న ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు అప్రమత్తమయ్యారు. రాజంపేట డీఎస్పీ చైతన్య ఆధ్వర్యంలో రాజంపేట, కోడూరు సీఐలు, ఎస్ఐలు ప్రత్యేక సిబ్బంది, బెటాలియన్‌లు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలకు సిద్ధమయ్యారు. ఈ మేరకు అన్ని పోలీస్‌స్టేషన్లను అప్రమత్తం చేశారు. సమస్యాత్మక గ్రామాలపై డేగ కన్ను వేశారు. ముందస్తు చర్యలో భాగంగా ఇరు పార్టీల నాయకులను హౌస్ అరెస్టు చేసి నోటీసులు జారీ చేశారు.

ఓట్ల లెక్కింపుపై అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

● నేతలు జిల్లాలు దాటి రాకుండా చెక్‌పోస్టుల్లో తనిఖీలు
● ఎన్నికల నోడల్ అధికారి, డీఎస్పీ బాబూజీ



కోడూరు పట్టణంలో హెచ్చరికలు చేస్తున్న పోలీసులు

రైల్వేకోడూరు, జూన్ 3: ఓట్ల లెక్కింపు సందర్భంగా అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని రైల్వేకోడూరు నియోజకవర్గ ఎన్నికల నోడల్ అధికారి, డీఎస్పీ బాబూజీ, టౌన్ సీఐ టి.బాబులు తెలిపారు. సోమవారం రైల్వేకోడూరులో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం పూర్తిగా కోడూరు పట్టణంలో ఎక్కడా గుంపులు, గుంపులుగా ఉండరాదన్నారు. రైల్వేకోడూరు, పుల్లంపేట, పెనగలూరు, చిట్వేలి, ఓబులవారిపల్లె మండలాల్లో ఎక్కడ అల్లర్లు జరిగినా చర్యలు కఠినంగా ఉంటాయని తెలిపారు. సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ పికెటింగులు ఏర్పాటు చేశామన్నారు. మండలంలోని రెడ్డివారిపల్లె, ఓబనపల్లె, లక్ష్మీగారిపల్లె, మైసూరివారిపల్లె, బొజ్జావారిపల్లె, రాఘవరాజపురం తదితర గ్రామాల్లో పోలీసు పికెట్లు ఏర్పాటు చేసి ఉన్నామని తెలిపారు. మంగళవారం ఉదయం అన్ని పార్టీల కార్యాలయాలకు కంచెలు ఏర్పాటు చేస్తున్నామని, ముందస్తుగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైల్వేకోడూరు నాయకులు, కార్యకర్తలు తిరుపతి తదితర నగరాల్లో ఉన్నారని వారు అక్కడి నుంచి రైల్వేకోడూరుకు రాకుండా ఉండాలని ఆదేశించామని తెలిపారు. జిల్లా దాటి రాకుండా బాలపల్లె తదితర ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 22 మంది గ్రేహ్యాండ్స్ బలగాలు, స్పెషల్ పార్టీలు, భాష్పవాయువు ప్రయోగించే సిబ్బంది, ఫైరింగ్ సిబ్బంది, లాఠీఛార్జ్ చేసే సిబ్బంది ఇలా వేర్వేరుగా ఉంటారన్నారు. రౌడీ షీటర్లను అదుపులోకి తీసుకుంటామని, ఎవరైనా తోకజాడిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని వారు హెచ్చరించారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదన్నారు. కోడూరు, పుల్లంపేట, చిట్వేలి, పెనగలూరు, ఓబులవారిపల్లె మండలాలకు చెందిన నాయకులను హౌస్ అరెస్టులు చేస్తున్నామని తెలిపారు. ఇది వరకే నోటీసులు కూడా ఇచ్చామన్నారు. ఏజెంట్లు మాత్రమే రాయచోటికి వెళ్లాల్సి వస్తుందన్నారు. ఎక్కడ అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూస్తామన్నారు. ప్రజలు, అన్ని పార్టీల నాయకులు పోలీసులకు సహకరించాలన్నారు.

స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేయాలి

● రాయచోటి అర్బన్, రూరల్ సీఐలు



మీడియాతో మాట్లాడుతున్న అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి

రాయచోటిటౌన్, జూన్ 3: జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా రాయచోటి పట్టణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పట్టణంలోని వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేసి బంద్‌కు సహకరించాలని రాయచోటి అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి, రూరల్ సీఐ తులసీరామ్, ఎస్ఐలు భక్తవత్సలం, లోకేశ్‌లు పిలుపునిచ్చారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో మంగళవారం రాయచోటి పట్టణంలో 144 సెక్షన్ అమల్లో ఉన్నందున వ్యాపారస్తులు ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేయాలన్నారు. అయితే ఎమర్జెన్సీ సర్వీసులకు మాత్రమే మినహాయింపు ఉంటుందని తెలిపారు. రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ గుంపులుగా ప్రజలు ఉన్నట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రాయచోటి ప్రాంత ప్రజలు, వ్యాపారస్తులు ప్రతిఒక్కరూ రేపు కౌంటింగ్ రోజున పోలీసు నిబంధనలు పాటించాలని వారు కోరారు.

విద్యార్థులకు పోటీ పరీక్షలు

రైల్వేకోడూరు, జూన్ 3: సమ్మర్ క్యాంపులో భాగంగా రైల్వేకోడూరు పట్టణంలోని గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యంశర్మ ఆధ్వర్యంలో మొదట విద్యార్థులకు హిందీ పరీక్ష పెట్టారు. 25 పదాలకు వాటి అర్థాలను ఆ పదాలకు ఆంగ్లంలో అనువాదం అనే విషయంపై, డ్రాయింగ్, జనరల్ నాలెడ్జ్, ఎస్ఏ రైటింగ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు ఈ నెల 7న బహుమతులు పంపిణీ చేయనున్నామన్నారు.

తూతూ మంత్రంగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

ఓబులవారిపల్లె, జూన్ 3: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా సోమవారం జరిగింది. ఎన్నికల కోడ్, ఎన్నికల కౌంటింగ్ ముందురోజు ఆర్భాటంగా ఏర్పాటు చేసిన ఈ సమావేశం ఎంపీడీవో కుళ్లాయిస్వామి, ఎంపీపీ చీర్ల నాగమ్మ అధ్యక్షతన జరిగింది. సమీక్ష జరిపేందుకు విషయం ఏమీ లేకపోవడంతో వచ్చిన అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎన్నికలకోడ్ సమయంలో ఆర్భాటంగా సమావేశం ఏర్పాటు చేయడం ఏమిటని నిట్టూర్పుగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు గౌరీశంకర్‌రాజు, కొమ్మూరు సుమిత్ర, ఈవోఆర్‌డీ, ఏపీఎం ఆర్ముగం, మండల శాఖాధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా వున్న చెత్త తొలగింపు



పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేస్తున్న డోజర్

సిద్దవటం, జూన్ 3: మండలంలోని కడప -చెన్నై రహదారి చాముండేశ్వరి నేషనల్ హైవే పక్కన వున్న ప్రాంతం చెత్తా చెదారంతో దుర్వాసన వెదజల్లుతూ అపరిశుభ్రంగా దర్శనమిస్తోంది. ఈ విషయాన్ని కొంతమంది ప్రజలు ఎంపీడీవో ఉమామహేశ్వరరావుకు సమాచారం అందించడంతో ఆయన వెంటనే స్పందించారు. డోజర్ సహాయంతో పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేయించారు. పంచాయతీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నేతలతో సుగవాసి భేటీ



సుబ్రమణ్యంను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

రాజంపేట, జూన్ 3: రాయచోటిలో కౌంటింగ్ సందర్భంగా రాజంపేట టీడీపీ అభ్యర్థి బాలసుబ్రమణ్యం టీడీపీ నాయకులతో సమావేశం అయ్యారు. ఓటింగ్‌పై వ్యవహరించే తీరు, ఏజెంట్లు అప్రమత్తం గురించి చర్చించారు. ప్రజాస్వామ్యబద్ధంగా, ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు నడుచుకోవాలని సూచించారు. టీడీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ప్రసాద్‌బాబు మాట్లాడుతూ ఎంతో కీలక ఘట్టమైన కౌంటింగ్‌లో ఏజెంట్లు అప్రమత్తంగా వుండాలన్నారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యంను పలువురు నాయకులు సత్కరించి అత్యధిక మెజార్టీలో గెలుపొందాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు. కార్యక్రమంలో లీగల్ సెల్ పార్లమెంటు అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, న్యాయవాది కృష్ణకుమార్, గీతాంజలి కళాశాల కరస్పాండెంట్ ఎస్‌వీ రమణ, డాక్టర్ నవీన్, వెంకటేశ్వరనాయుడు, అగ్రహారం నాయకులు సుధాకర్, మైనార్టీ నాయకులు షామీర్ బాష తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం: ఏపీలో టీడీపీ కూటమి తిరుగులేని విజయం సాధిస్తుందని కడప జిల్లా తెలుగు యువత మాజీ అధ్యక్షుడు కుప్పాల వెంకటసుబ్బయ్య ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల కౌంటింగ్ మంగళవారం ప్రారంభం కానున్న నేపథ్యంలో సోమవారం సుగవాసి బాలసుబ్రమణ్యంను టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్, కడప జిల్లా తెలుగు యువత మాజీ అధ్యక్షుడు కుప్పాల వెంకటసుబ్బయ్య, నారాయణలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 4న టీడీపీ విజయడంకా మోగిస్తుందని, సుగవాసి సుబ్రమణ్యం అత్యధిక మెజార్టీతో గెలుస్తారన్నారు.

జిల్లా క్రికెట్ జట్టుకు నందలూరు బాలికలు





జిల్లా జట్టుకు ఎంపికైన అనిలా, పూర్వీజా

నందలూరు, జూన్ 3: కడప జిల్లా బాలికల అండర్ -15 క్రికెట్ జట్టుకు నందలూరు సబ్ సెంటర్ నుంచి ఎ.అనీలా బ్యాట్స్‌గర్ల్స్, పూర్విజా మీడియం ఫాస్ట్ బౌలర్‌గా ఎంపికైనట్లు హెడ్‌కోచ్ గయాజ్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ గతంలో కూడా నందలూరు సబ్ సెంటర్ నుంచి అండర్ -15, అండర్ -19 సీనియర్స్ విభాగాలలో హరిప్రియ, దివ్యశ్రీలు కూడా జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయి క్రికెట్ క్రీడాకారులుగా ఎంపికయ్యారన్నారు. ఈ నెల 3 నుంచి 8వతేదీ వరకు నెల్లూరులో జరిగే జిల్లాస్థాయి టోర్నమెంటు నందు అనిలా, పూర్వీజలు పాల్గొంటారన్నారు. ఈ సంవత్సరం కూడా నందలూరు సబ్ సెంటర్ నుంచి ఇద్దరు క్రీడాకారులు అండర్ -15 జట్టుకు ఎంపికైనందున అసిస్టెంటు కోచ్ ఫిరోజ్‌ఖాన్‌లోడీ, ట్రైనర్ శివకోటి, క్యూరేటర్ హరికృష్ణ, స్థానిక సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

దుకాణాలను స్వచ్ఛందంగా మూసి వేయండి



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ పురుషోత్తంరాజు

సిద్దవటం, జూన్ 3: మండలంలో దుకాణదారులు, వ్యాపారస్తులు స్వచ్ఛందంగా తమ దుకాణాలను మూసి వేయాలని ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలో సోమవారం బస్టాండు కూడలిలో ఆయన ప్రజలతో మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా 144 సెక్షన్ అమల్లో వుందని, ప్రజలు గుంపులుగా వుండరాదన్నారు. కిరాణాషాపు యజమానులు, దుకాణదారులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేయాలన్నారు. ఎన్నికల కౌంటింగ్ సెంటర్‌కు ఎవరు పల్లె ప్రాంతాల ప్రజలు రావద్దని, ఊరేగింపు, ర్యాలీ లాంటి కార్యక్రమాలు చేయరాదన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలుంటాయన్నారు.

ముగిసిన దండుమారెమ్మ తిరుణాల



ప్రత్యేక అలంకరణలో దండుమారెమ్మ

సుండుపల్లె, జూన్ 3: మండలంలోని భాగంపల్లె గ్రామ పంచాయతీ కుంటల ముందరలో వెలిసిన దండుమారెమ్మ తిరుణాల సందర్భంగా ఆదివారం గ్రామస్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ప్రతి ఏడాది ఎంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారి జాతరను నిర్వహించడం ఆనవాయితీ వస్తోంది. సోమవారం గ్రామస్తులు బోనాలు సమర్పించి అన్నదాన కార్యక్రమాల్ని ఏర్పాటు చేశారు. గత రెండు రోజుల నుండి అమ్మవారికి భక్తులు అభిషేకం, హోమం, పూజలు నిర్వహించారు. ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణలతో చాందినీ బండ్లు భక్తులకు దర్శనం ఇచ్చాయి. మొక్కుబడులు ఉన్న భక్తులు అమ్మవారికి చాందినీ బండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



సుదర్శన్‌బాబు (ఫొటో)

లక్కిరెడ్డిపల్లె, జూన్ 3: మండలంలోని పాళెం బుర్షుపల్లెకు చెందిన సుదర్శన్‌బాబు (38) అనే వ్యక్తి గత వారం రోజులుగా కనిపించలేదని ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. బుర్షుపల్లెకు చెందిన సుదర్శన్ బాబు మంగళవారం 28వ తేదిన సాయంత్రం స్నేహితులతో కలసి పల్లెకు సమీపంలో ఉన్న శేషాచల అడవిలోకి సొంతపని నిమిత్తం వెళ్లారని, అయితే సుదర్శన్ వెంట వెళ్లిన స్నేహితులు తిరిగి ఇంటికి వచ్చారని అతను మాత్రం ఇంటికి రాకపోవడంతో మరుసటి రోజు బుధవారం అతని కుటుంబ సభ్యులు అడవి అంతా వెతికారని తెలిపారు. ఎక్కడా కనిపించకపోవడంతో సుదర్శన్ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారని, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

కడప(మారుతీనగర్), జూన్ 3: కడపలోని ప్రధాన మంత్రి కేంద్రీయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ఈ నెల 4 నుంచి 10వ తేది మధ్యాహ్నం 1 గంటలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల అసోసియేషన్ కార్యదర్శి ఉమేష్‌బాబు, ఉపాధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, కోశాధికారి జితేంద్ర తెలిపారు. సీబీఎస్ఈ, స్టేట్‌బోర్డు, ఐసీఎస్ఈ, ఎస్ఐఎస్ సిలబస్‌లో పదవ తరగతి పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ. కేవీఎస్ఎన్‌జీపీటీఏఎన్, ఎన్ఐసీఐఎన్ అనే వెబ్‌సైట్ చూడాలన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

● రూ. 50వేల విలువ చేసే మూడు కిలోల గంజాయి సీజ్



గంజాయి, నిందితుడ్ని మీడియాకు చూపిస్తున్న సీఐ ఉలసయ్య

చిత్తూరు, జూన్ 3: గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ ఉలసయ్య వివరాల మేరకు నగరంలోని వీరభద్రకాలనీలో గంజాయి అమ్ముతున్నాడని పోలీసులకు సమాచారం అందింది. ఎస్‌ఐ ఇక్బాల్, సిబ్బందితో కలిసి మంగళవారం నీవానది ఒడ్డున దాడులు నిర్వహించి షణ్ముగం(32) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. రూ. 50వేల విలువ చేసే మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతడ్ని రిమాండ్‌కు తరలించారు. నిందితుడిపై రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఇప్పటికే మూడు కేసులు నమోదుకాగా తాజాగా రౌడీ షీట్ ఓపెన్ చేసినట్లు సీఐ తెలిపారు. గంజాయిని పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన అధికారులు, సిబ్బందిని డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి అభినందించారని సీఐ తెలిపారు.

బావిలో పడ్డ జింక

● కాపాడిన అగ్నిమాపక సిబ్బంది



జింకను బావిలోనుంచి వెలికి తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది (ఇన్‌సెట్‌లో) బయటపడ్డ జింక

కుప్పం, జూన్ 3: వంద అడుగుల లోతు గల ఎండిపోయిన బావిలో పడిన జింకను కుప్పం అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. కుప్పం మండలం గణేశ్‌పురం మలుపు వద్ద కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని ఓ ఎండిన బావిలో ఒక అడవి జింక ప్రమాదవశాత్తు పడిపోయింది. స్థానికులు కొందరు ఈ విషయం గురించి కుప్పం అగ్నిమాక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపకాధికారి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారం సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వారిలో ఇద్దరు బావిలోకి దిగి, తాళ్ల సాయంతో జింకను వెలికి తీసి ప్రాణాలు కాపాడారు. అనంతరం జింకను అటవీ శాఖాధికారులకు అప్పగించారు.

ఒంటరి ఏనుగు బీభత్సం



కల్లూరు, జూన్ 3: పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ కోటపల్లి సమీపంలో ఆదివారం రాత్రి ఒంటరి ఏనుగు మామిడి చెట్లను ధ్వంసం చేసింది. దాదాపు 10 చెట్లను విరిచేసింది. సుమారు అర టన్ను మామిడికాయలు నేలరాలాయి. కోటపల్లికి చెందిన రైతు దామోదర్‌నాయుడుకు చెందిన మామిడి తోటలోకి ఆదివారం రాత్రి చొరబడిన ఒంటరి ఏనుగు బీభత్సం చేసింది.

అగ్రిలో డిప్లొమా కోర్సులకు ఆన్‌లైన్ దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి రూరల్, జూన్ 3: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ పరిధిలో నిర్వహించే వ్యవసాయ డిప్లొమా కోర్సులకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తిరుపతిలోని వ్యవసాయ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.రమణ తెలిపారు. పదో తరగతి విద్యార్హతతో ప్రవేశాలు కల్పించే ఈ కోర్సులకు ఈనెల ఒకటో తేదీనుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని, ఇదేనెల 20వ తేదీవరకు గడువుందని చెప్పారు. ఇంటర్ ఫెయిలైన వారు కూడా దరఖాస్తు చేయవచ్చని, 2024 ఆగస్టు 31వ తేదీనాటికి 15-22 ఏళ్ల మధ్య వయసున్నవారు అర్హులని తెలిపారు. గ్రామీణ, మున్సిపల్ పాఠశాలల్లో చదివిన వారికి 75:25 నిష్పత్తిలో సీట్ల కేటాయింపు ఉంటుందని చెప్పారు. వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్ ఏఎన్‌జీఆర్ఏయూ.ఏసీ.ఇన్‌ని సంప్రదించాలని కోరారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ తదితరాలకు 0877-2249909, 9618167187 ఫోన్ నెంబర్లని సంప్రదించాలని సూచించారు.

జోనల్‌స్థాయి ఫుట్‌బాల్ విజేతగా నెల్లూరుజట్టు



రన్నరప్‌గా నిలిచిన తిరుపతి జట్టు

తిరుపతి(క్రీడలు), జూన్ 3: జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం తుమ్మలగుంట క్రీడామైదానం వేదికగా జరిగిన జోనల్‌స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో నెల్లూరు జట్టు విజయం సాధించింది. ఈ పోటీలకు కోరమండల్ జోనల్ పరిధిలోని తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాల నుంచి ఫుట్‌బాల్ జట్లు ప్రాతినిథ్యం వహించాయి. రౌండ్‌రాబిన్ పద్ధతిలో మ్యాచ్‌లు నిర్వహించగా, తుదిపోరులో నెల్లూరు, తిరుపతి జట్లు తలపడ్డాయి. ఇందులో విజేతగా నిలిచిన నెల్లూరు జట్టుకు ట్రోఫీ, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ జట్టు ఈనెల 6నుంచి విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. తిరుపతి జట్టు రన్నరప్‌గా సరిపెట్టుకుంది. ముఖ్యఅతిథిగా జిల్లా క్రీడాధికారి సయ్యద్‌సాహెబ్ హాజరై ప్రసంగిస్తూ ఫిట్‌నెస్‌ను మెరుగుపరుచుకుని గొప్ప ఆటగాళ్లుగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి రెడ్డెప్ప, శ్రీనివాసులు, ప్రభాకర్, వినోద్, రమేష్, రాజీవ్ పాల్గొన్నారు.

రాష్ట్రానికి పట్టిన దరిద్రాన్ని దేవుడు తొలగిస్తాడు

- ఎంపీ రేణుకా చౌదరి

తిరుమల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఏపీకి మంచిరోజులు వస్తున్నాయని, రాష్ట్రానికి పట్టిన దరిద్రాన్ని దేవుడు తొలగిస్తాడని ఎంపీ రేణుకా చౌదరి అన్నారు. తిరుమల శ్రీవారిని సోమవారం దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. 2000 నుంచి ఎగ్జిట్‌పోల్స్ ఎన్నిసార్లు తప్పులు చెప్పాయో అందరూ గ్రహించాలని చెప్పారు. కాంగ్రెస్‌కి చెందిన వారంగా, దేశప్రగతి కోసం సేవ చేస్తున్నామన్నారు. దేశ ప్రజలందరూ బాగుండాలని, ముఖ్యంగా రైతులకు మంచి పంటలు పండి ఆరోగ్యంగా, ధైర్యంగా ఉండేలా స్వామి దీవిస్తారని ఆశిస్తున్నానన్నారు.

పరిషత్‌కు పంపుతారనే వార్తలు వదంతులే

- నటి సుమలత



తిరుమల, జూన్3 (ఆంధ్రజ్యోతి): తనను బీజేపీ పరిషత్‌కు పంపాలని చూస్తుందనే వార్తలు వదంతులు మాత్రమేనని నటి సుమలత వివరణ ఇచ్చారు. ఆ సీటు వేరే వాళ్లకు కూడా ప్రకటించారని తెలిపారు. ప్రస్తుతం తాను స్టేట్ పాలిటిక్స్ వైపు చూడటం లేదన్నారు. తిరుమల శ్రీవారిని సోమవారం దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. రాజ్యసభ సీటు ఆశిస్తున్నారా అనే ప్రశ్నకు చూద్దామని బదులిచ్చారు. ఖచ్చితంగా కేంద్రంలో బీజేపీనే వస్తుందని ఎగ్జిట్ పోల్స్ చెప్పాయని, అందులో ఎలాంటి సందేహం లేదన్నారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, మోదీ 0.3ని చూస్తామన్నారు. తన కుమారుడు హీరో అభిషేక్ అంబరీష్, కోడలు, కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. సుమలతతోపాటు నిర్మాత రాక్‌లైన్ వెంకటేష్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి



చిత్తూరులోని ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం కౌంటింగ్ సందర్భంగా ఏర్పాట్లు పూర్తయిన కుప్పం నియోజకవర్గ సర్వీసు ఓట్ల లెక్కింపు కేంద్రం, పూతలపట్టు నియోజకవర్గ ఓట్ల లెక్కింపు కేంద్రం, కౌంటింగ్ కేంద్రం లోపల ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య తదితరులు



అడుగడుగునా తనిఖీలు, చిత్తూరులో కౌంటింగ్ కేంద్రం సమీపంలో పోలీసుల పహారా, మురకంబట్టు సర్కిల్ వద్ద పోలీసు పికెట్

ప్రశాంత కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

● జిల్లా అంతటా 144 సెక్షన్
● పోలీసు అధికారుల సమావేశంలో ఎస్పీ మణికంఠ



పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు, జూన్ 3: ఎస్వీసెట్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహిస్తున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌ను సజావుగా, పారదర్శకంగా జరిపించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. ఓట్ల లెక్కింపుపై ఎస్వీసెట్ కళాశాల సమావేశపు హాలులో సోమవారం ఆయన పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. పోలింగ్ రోజున ఎలాగైతే విధులు నిర్వహించారో... కౌంటింగ్ రోజున అదే ఒరవడిని కొనసాగించి సజావుగా జరిగేలా చూడాలన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఎంట్రెన్స్, ఎగ్జిట్ల వద్ద ఏర్పాటు చేసిన యాక్సెస్ కంట్రోల్ ద్వారా క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే కౌంటింగ్ సిబ్బందిని, ఏజెంట్లను, అధికారులను లోపలకు అనుమతించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలు, రహదారుల వద్ద కట్టుదిట్టమైన నిర్బంధాన్ని అమలు చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద అనుమానాస్పద వాహనాలు, వ్యక్తులు సంచరించకుండా నిఘా ఉంచాలన్నారు. కమ్యునికేషన్ వ్యవస్థలను వినియోగించుకోవాలన్నారు. పోలీసులకు నిర్దేశించిన పాయింట్లలో ఎలాంటి అలసత్వం వహించకుండా విధులు నిర్వహించాలన్నారు.

ప్రజలూ సహకరించండి

జిల్లా అంతటా 144 సెక్షన్, 30 యాక్టు అమలులో ఉన్నందున ముగ్గురికి మించి ఎక్కువ మంది గుమికూడితే చర్యలు తప్పవని ఎస్పీ మణికంఠ హెచ్చరించారు. నిబంధనలను ఉల్లఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమన్నారు. క్యూఆర్టీ వాహనాలు నిరంతరం తిరుగుతూ ఉంటుందని, వాటి సీసీ కెమెరా ఫుటేజీలో రికార్డు అయిన దృశ్యాల ద్వారా చట్టపర చర్యలు తీసుకుంటామన్నారు. లెక్కింపు రోజున అమలులో ఉన్న ఆంక్షలు, మార్గదర్శకాలను తెలుసుకుని ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు అరీఫుల్లా, నాగేశ్వరరావు, డీఎస్పీలు రాజగోపాల్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్, ఇలియాస్ బాషా, పవన్‌కుమార్, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

భర్త వేధింపులతోనే వేదవతి ఆత్మహత్య

మృతురాలి తల్లిదండ్రుల ఆరోపణ ● దస్తగిరికి దేహశుద్ధి చేసిన మహిళలు ● భీమగానిపల్లెలో పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు



వేదవతి మృతదేహం వద్ద పోలీసుల గౌరవ వందనం

పుంగనూరు, జూన్ 3: భర్త దస్తగిరి వేధింపులతోనే తమ బిడ్డ వేదవతి ఆత్మహత్య చేసుకుందని తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీసు జిల్లా కార్యాలయంలో ఆదివారం సాయంత్రం గన్‌తో కాల్చుకుని మహిళా కానిస్టేబుల్ వేదవతి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. రాయచోటి ఏరియా ఆస్పత్రి నుంచి ఆమె మృతదేహాన్ని తల్లిదండ్రులు గంగాధర్, రాఘవమ్మ, పోలీసులు పుంగనూరు మండలం భీమగానిపల్లెకి సోమవారం మధ్యాహ్నం తీసుకొచ్చారు. మృతురాలి భర్త దస్తగిరి కూడా రావడంతో గ్రామంలోని మహిళలు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్యాయంగా తమ బిడ్డను పొట్టనపెట్టుకుని పసిబిడ్డను అనాథను చేశావంటూ దేహశుద్ధి చేశారు. వేదవతి కుమార్తె షఫీనా(5)ను అంత్యక్రియలకు తీసుకురాకుండా మదనపల్లెలోని దస్తగిరి అమ్మవద్ద విడిచి రావడంపై ఆగ్రహించారు. తమకు బిడ్డను అప్పగించే వరకు అంత్యక్రియలు చేయబోమని భీష్మించారు. భర్త కొట్టడం, హింసించడం వల్లే తమ బిడ్డ చనిపోయిందని, వేదవతి ఉద్యోగం భర్తకు ఇవ్వొద్దని, పసిబిడ్డను తమకు అప్పగించాలని రాయచోటి నుంచి వచ్చిన ఏఆర్ డీఎస్పీ, పోలీసులను కోరారు. వివాహం చేసుకునేటప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని, ఇప్పుడు మాట్లాడితే ప్రయోజనం ఏమిటని, ముందే జాగ్రత్తలు తీసుకుని ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని పోలీసులు సర్దిచెప్పారు. మదనపల్లెనుంచి షఫీనాను పోలీసులు తీసుకొచ్చారు. గంగాధర్ ఇంటి వద్ద పోలీసులు వేదవతి మృతదేహానికి గౌరవవందనం చేసి పూలమాలలతో నివాళులర్పించారు. 'కూలిపనులు చేసి వేదవతిని చదివించాం. పుంగనూరులో 9 నెలలు కోచింగ్‌కు పంపితే ముందే పెళ్లి చేసుకుని బిడ్డ ఉన్న వ్యక్తి మాటలకు మోసపోయి జీవితం నాశనం చేసుకుంది. చాలా మంచోడని వెళ్లింది. అతడికి ముందే పెళ్లయిన విషయం తెలిసి సంవత్సరం తర్వాత ఫోన్ చేసింది ఏడ్చింది. భార్య జీతం, లోన్లు తింటూ నరకం చూపించాడు. మూడునెలల క్రితం ఫోన్‌చేసి నన్ను కొడుతున్నాడని, చాలా ఇబ్బందిపడుతున్నానని, నేను వచ్చేస్తానని చెబితే వచ్చేయమన్నాం. పెళ్లి కావాల్సిన సోదరికి ఇబ్బందని ఆలోచించి పుట్టింటికి రాకుండా ఇబ్బంది పపడింది. గతంలో ఒకసారి మావద్దకు వచ్చినందుకు దస్తగిరి గొడవ చేశాడు. రాయచోటిలో వేదవతి శవాన్ని కూడా ఇవ్వమని చెప్పారు. మేము ఒక్క రూపాయి జీతం కూడా తినలేదు. బిడ్డకు టెంకాయ కొట్టుకునేందుకు తీసుకెళతామని పట్టుబడితే ఇచ్చారు' అంటూ తల్లి రాఘవమ్మ రోదించారు. వివిధ గ్రామాలకు చెందిన మహిళలు, ప్రజలు అధిక సంఖ్యలో అంత్యక్రియల్లో పాల్గొన్నారు. శ్మశానం వద్ద రాయచోటి పోలీసులు మరో సారి వేదవతి మృతదేహానికి గౌరవవందనం చేసి, గాలిలోకి మూడురౌండ్ల కాల్పులు జరిపి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిపించారు. కాగా, వేదవతి భర్త దస్తగిరికి గ్రామస్తులు దేహశుద్ధి చేయడంతో అతడు అంత్యక్రియల్లో పాల్గొనకుండా వెళ్లిపోయాడు.

మామిడి కాయలకు రక్షక కవచం

అధిక ధరలతో లాభాల బాటలో రైతన్న



సోమల మార్కెట్‌లో రక్షక కవచం ఉన్న మామిడిని ప్యాకింగ్ చేస్తున్న కూలీలు

సోమల, జూన్ 3: మామిడి కాయలకు రక్షక కవచం తొడగడంతో మార్కెట్‌లో అధిక ధరలు పలుకుతున్నాయి. కిలోకు రూ.22 అదనంగా పొందుతున్నారు. సోమల మండలంలో పలువురు రైతులు మామిడి తోటల్లో దిగుబడులు వచ్చిన వెంటనే కాయలు ఒక సైజుకు వచ్చినప్పుడు ఈ రక్షక కవచాలను కాయలకు కడుతున్నారు. దీంతో కాయలు కోత సమయంలో అధిక ధరలు పలుకుతున్నాయి. సోమల మార్కెట్‌లో సోమవారం బేనిషా రకం కిలో రూ. 50 పలకగా, రక్షక కవచం ఏర్పాటు చేసిన కాయలకు అదనంగా రూ.22 చెల్లించారు. దీంతో కిలో రూ. 72 పలికింది. మల్లికా రకం రూ. 65, తోతాపురి కిలో రూ. 57కు చేరుకుంది. రక్షక కవచం కట్టడంతో మామిడి కాయలకు పురుగుల బెడద లేకుండా చూసుకోవడంతో పాటు వీటికి వర్షంతో దెబ్బతినకుండా ఉంటుంది. గాలి వానలకు రాలకుండా ఉంటుంది. వాతావరణ పరిస్థితులను తట్టుకుంటుంది. కాయలు నాణ్యతతో ఉండడం రైతులు ఉత్సాహం చూపుతున్నారు. సోమల మండలంలోని పలువురు రైతులకు పలు మామిడి సొసైటీలు సబ్సిడీ ధరలకు అందజేశారు. ఒక్కో రక్షక కవర్ రూ.1.80 కి, రూ.2 విక్రయించారు. వీటిని రైతులు తమ తోటల్లోని కాయలకు కట్టడానికి ఒక్క రూపాయి, రూ.1.50 వంతున చెల్లించారు. కోత సమయంలో వీటికి ప్రత్యేక ధర రావడంతో కవర్లు కట్టడానికి ఉత్సాహం చూపుతున్నారు. ఉద్యానశాఖ సబ్సిడీతో అందజేస్తామని ప్రకటించినా సకాలంలో రైతులకు అందజేయలేక పోయారు. అధికారులు స్పందించి రాబోవు మామిడి సీజన్‌కు రాయితీ ధరతో రైతులకు రక్షక కవర్లు అందజేయాలని కోరుతున్నారు.

సకల శుభాలకు మూలం ఆంజనేయస్వామి ఉపాసన

స్వస్వరూపానందగిరి స్వామి

తిరుమల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సకల దేవతల ఆరాధనకు హనుమంతుడిని ఆశ్రయించడం ఒక్కటే మార్గమని, తద్వారా సకల శుభాలు చేకూరుతాయని శ్రీనివాసమంగాపురం వశిష్టాశ్రమ లలితా పీఠం వ్యవస్థాపక పీఠాధిపతి స్వస్వరూపానందగిరి స్వామి ఉద్ఘాటించారు. హనుమత్ జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం తిరుమలలోని నాదనీరాజనం, ఆకాశగంగ, జపాలి తీర్థంలో నిర్వహించిన ఆధ్యాత్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా నాదనీరాజనం వేదికపై స్వస్వరూపానందగిరి స్వామి అనుగ్రహభాషణం చేస్తూ రామ నామాన్ని ఎవరైతే జపిస్తారో వారందరినీ హనుమంతుడు అనుగ్రహిస్తారని, తులసీదాసు తదితర మహనీయుల చరిత్రను వివరించారు. ఆకాశగంగలో ఉదయం 10 గంటలకు జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయం అధ్యాపకులు ఆచార్య రాఘవాచార్యులు హనుమంతుడి జన్మ విశేషాలు తెలిపారు. జపాలిలో ఉదయం 8 గంటలకు తిరుపతికి చెందిన ఉదయ్ భాస్కర్ బృందం హనుమాన్ చాలీసాను పఠించారు. తర్వాత ఎస్వీ సంగీత నృత్య కళాశాల అధ్యాపకుల వందన బృందం ఎందరో మహానుభావులు.., అంజనేయ జగదేక వీర.., బంటు రీతి కొలువు ఈయవయ్య రామా.., వంటి కీర్తలను ఆలపించారు. అనంతరం తిరుపతికి చెందిన ప్రసన్నలక్ష్మి బృందం హనుమాన్ చాలీసా పఠించారు. అలాగే అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు లలిత శివజ్యోతి బృందం గ్రాత కచేరి నిర్వహించారు.

బాలాంజనేయస్వామికి పుష్పార్చన

హనుమత్ జయంతి ఉత్సవాల్లో భాగంగా తిరుమలలోని ఆకాశగంగలో అంజనాదేవి సమేత బాలాంజనేయస్వామికి సోమవారం ఉదయం కనకాంబరం, సింధూర వర్ణ గన్నేరి పుష్పాలతో విశేష సహస్ర నామార్చనను అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా టీటీడీ వైఖానస ఆగమ సలహాదారు మోహనరంగాచార్యులు అంజనాద్రి, ఆకాశగంగ అంజనేయస్వామి జన్మస్థల, స్వామి వైభవం గురించి వివరించారు. అనంతరం స్వామికి పంచామృత తిరుమంజనం జరిగింది. టీటీడీ అధికారులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

చిత్తూరు సిటీ, జూన్ 3: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ ఈఎస్ ఆయేషా బేగం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో 3, 4, 5 తేదీల్లో ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్‌లు, క్లబ్‌లు, టూరిజం బార్లు, మిలిటరి క్యాంటీన్, కల్లు దుకాణాలు మూసివేయాలన్నారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా మద్యం విక్రయాలు జరిపితే లైసెన్సులు రద్దుచేస్తామని హెచ్చరించారు.

బోసిపోయిన కలెక్టరేట్

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 3: గత 40 రోజులుగా ఎన్నికల ప్రక్రియలో నిమగ్నమైన కలెక్టరేట్ సిబ్బంది.. చివరి ఘట్టమైన ఓట్ల లెక్కింపు కోసం 24 గంటల ముందే ఎస్వీసెట్ ఇంజినీరింగ్ కళాశాల కౌంటింగ్ కేంద్రానికి తరలివెళ్ళారు. కౌంటింగ్ కోసం జిల్లా ఎన్నికల విభాగం సుమారు 1200 మంది సిబ్బందిని అన్ని పనులకు నియమించగా, వారిలో 150 మంది కలెక్టరేట్ సిబ్బందిని చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ సర్వీసు ఓట్ల లెక్కింపు, ఇతర లెక్కింపు పనులకు కలెక్టర్ షన్మోహన్ నియమించారు. దీంతో అన్ని కీలక విభాగాల్లోని అధికారులు, సిబ్బంది ఎస్వీసెట్‌కు వెళ్లడంతో కలెక్టరేట్ బోసిపోయింది. పనుల కోసం వచ్చిన చాలామంది వెనుదిరిగి వెళ్లారు.

పలకరించిన నైరుతి

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 3: గత నెలరోజులుగా వడగాల్పులతో అల్లాడిన జనం నైరుతి రుతుపవనాల పలకరింపుతో పులకరించారు. జిల్లావ్యాప్తంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకు 18 మండలాల్లో తేలికపాటి నుండి బలమైన వర్షం కురిసింది. మండలాలవారీగా... రామకుప్పంలో 50.4, పుంగనూరులో 38.4, బైరెడ్డిపల్లెలో 32.8, గంగవరంలో 30.4, పెద్దపంజాణిలో 27.2, శాంతిపురంలో 25.2, కుప్పంలో 16.4, పెనుమూరులో 16.0, గుడుపల్లెలో 14.6, పలమనేరులో 12.8, బంగారుపాళ్యంలో 10.2, నగరిలో 6.8, చిత్తూరు రూరల్‌లో 4.2, జీడీనెల్లూరులో 3.4, సదుంలో 3.2, రొంపిచెర్లలో 1.4, వెదురుకుప్పంలో 1.4, పూతలపట్టులో 1.2 మిమీ వర్షం కురిసింది.

కొన్నిశాఖల ఉద్యోగులకే జీతాలు

● పెన్షనర్లకు నిరాశే!

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 3: ప్రభుత్వ ఉద్యోగులకు జీతాల సమస్య ఇంకా కొలిక్కి రాలేదు. తొలిరోజే అందుతాయని ఆశించినవారికి నిరాశే ఎదురైంది. కొత్త ప్రభుత్వం ఏర్పడే విషయంలో ప్రస్తుత ప్రభుత్వం ఒకటో తేదీనే జీతాలు వేస్తుందని ఆశపడ్డ ప్రభుత్వ ఉద్యోగులకు ఎదురుచూపులే మిగిలాయి. గతంలో మాదిరిగానే ఎప్పుడు పడతాయో ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సోమవారం కలెక్టరేట్, రెవెన్యూ, పోలీసు, వైద్య, ఆరోగ్య, న్యాయ, ఖజానాశాఖ ఉద్యోగులకు మాత్రమే జీతాలు పడగా, మెజార్టీ ఉద్యోగులున్న శాఖలకు మాత్రం ఇంకా జీతాలు అందని పరిస్థితి. జిల్లాలో ఉన్న 12,505 మంది పెన్షనర్లకు కూడా వారి బ్యాంకు ఖాతాల్లో పెన్షన్లు జమకాలేదు. ఒకటో తేదీ నే పెన్షన్లు పడతాయని ఆశించినా... జగన్ సర్కార్ అం దుకు భిన్నంగా వ్యవహరించడంతో పెన్షనర్లు మండిపడుతున్నారు. ఉపాధ్యాయుల జీతాల విషయంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

23 దుంగలు స్వాధీనం ముగ్గురు నిందితుల అరెస్టు



దుంగలతో పట్టుబడిన నిందితులను చూపుతున్న సీఐ శేఖర్

వాల్మీకిపురం, జూన్ 3: అన్నమయ్య జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వాల్మీకిపురం పోలీసులు సోమవారం దాడులు చేసి 23 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ పులి శేఖర్ తెలిపారు. సీఐ కథనం మేరకు..వాల్మీకిపురం మండలం కూరపర్తి గ్రామానికి చెందిన అన్నదమ్ములు పట్నం లక్ష్మణాచారి(35), పట్నం శ్రీరా ములుఆచారి(30), తిరుపతి జిల్లా ముత్యాలరెడ్డిపల్లెకు చెందిన పి.పవన్‌కుమార్(34)లు ముగ్గురు కలిసి దుంగలను అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. సుండుపల్లె సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి ఎర్రచందనం దుంగలను ఏపీ05 బీహెచ్2727 కారులో తరలిస్తూ మరో కేఏ03ఎంహెచ్1769 కారును పైలెట్ వాహనంగా పెట్టుకుని సోమవారం వేకువజామున మండలంలోని చింతపర్తి-చిమ్మనపల్లె రోడ్డుగుండా బెంగళూరు ప్రాంతానికి రవాణా చేస్తుండగా తనతోపాటు ఎస్ఐ నాగేశ్వర్‌రావు, సిబ్బంది వాహనాలను వెంబడించి దాడి చేసి పట్టుకున్నామన్నారు. ఈ దాడులలో 23 ఎర్రచందనం దుంగలు, రెండు వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. వాహనాల సహా మొత్తం రూ.32 లక్షల విలువైన ఎర్రచందనం పట్టుబడినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరు పరిచారు. కాగా పట్నం లక్ష్మణాచారి, పవన్‌కుమార్‌లు ఇరువురు గతకొద్దినెలల క్రితం కుప్పంలో ఎర్రచందనం తరలిస్తూ పట్టుబడడం గమనార్హం. ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకున్న సీఐ, ఎస్ఐ, సిబ్బందిని జిల్లా ఎస్పీ, డీఎస్పీలు అభి నందించారు.

యువకుడికి తీవ్రగాయాలు

బి.కొత్తకోట, జూన్3: బి.కొత్తకోట మండలంలోని బడికాయలపల్లె గ్రామానికి చెందిన శివశంకర్ అనే వ్యక్తి విద్యుత్ షాక్ తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. తన ఇంటికి గత రెండురోజులుగా విద్యుత్ సరఫరా కాలేదని స్వయంగా విద్యుత్ పని చేస్తుండగా షాక్‌కు గురై కిందపడి తీవ్రంగా గాయప డ్డాడు. వెంటనే కుటుంబీకులు శివశంకర్‌ను ప్రైవేటు వాహ నంలో మదనపల్లెకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం అక్కడి వైద్యులు మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు.

నిమ్మనపల్లెలో బాలికకు తీవ్రగాయాలు

నిమ్మనపల్లి, జూన్ 3: నిమ్మనపల్లి మండలం రాచవేటివారిపల్లికి చెందిన శ్రీనివాసులు కుమార్తె జి.వైష్ణవి(13) ఇంటి వద్ద ఆడుకొంటూ విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన స్టేవైరు తాకడంతో విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడింది. గమనించిన కుంటీకులు వెంటనే బాలికను 108 సాయంతో మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు సీజ్

మదనపల్లె అర్బన్, జూన్3: స్థానిక బెంగళూరు రోడ్డు సమీపంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు సెబ్ సీఐ రమేష్‌రెడ్డి తెలిపారు. సోమవారం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో అక్రమంగా ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో తమ సిబ్బందితో కలిసి వెళ్లి అక్కడే రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి డ్రైవ ర్లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నాలుగు రోజుల క్రితం సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి తాలుకా స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసిన సంఘటన మరువక ముందే ఇలా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసి జరిమానా విధించడం విశేషం. ఈ సందర్భంగా సెబ్ సీఐ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో, వంకల్లో, వాగుల్లో, గుట్టల్లో అక్రమంగా అనుమతులు లేకుండా చట్టవిరుద్ధంగా మట్టిని, ఇసుకను తరలిస్తే చట్టపర మైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోలీస్ నిబంధనలు పాటించాలి

బి.కొత్తకోట, జూన్3: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ను పురస్కరించుకుని బి.కొత్తకోట మండల వ్యాప్తంగా, ముఖ్యంగా పట్టణంలో పోలీస్‌వారు అమలు చేస్తున్న నిబంధనలు అందరూ తప్పనిసరిగా పాటించాలని బి.కొత్తకోట సీఐ సూర్యనారాయణ పేర్కొన్నారు. పట్టణంలో మూడురోజుల పాటు144 సెక్షన్, 30యాక్ట్ అమలులో వుంటుందన్నారు. గుంపులుగా చేరడం, బాణసంచా పేల్చడం, ఊరేగింపులకు ఎట్టి పరిస్థితి లోనూ అనుమతులు లేవన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు సంయమనం పాటించాలని, అనవసర విషయాలలో తలదూర్చి కేసులలో ఇరుక్కోవద్దని ఆయన సూచించారు. పట్టణంలోని జ్యోతిసర్కిల్, బెంగళూరురోడ్డు లలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసి, గట్టి నిఘా ఏర్పాటు చేశారు.

పెద్దమండ్యంలో 144 సెక్షన్ అమలు

పెద్దమండ్యం, జూన్ 3: పెద్దమండ్యం మండలంలో మంగళవారం 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్ఐ చెన్నకేశవ వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎలాంటి అవాంచనీయ సంఘటన జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మండలంలోని టీ, కిరాణ దుకాణాలు బంద్ చేయాలని దుకాణ యజయానులు పోలీసుల సూచనలు తప్పకుండ పాటించాలన్నారు. కోడ్ ఉల్లంఘనలకు పాల్పబడితే బైండోవర్ చేస్తామని హెచ్చరించారు. సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక పోలీసుల నిఘాతో పాటు పోలీసు యాక్ట అమల్లో ఉందన్నారు. ఏఎస్ఐలు ఇసాక్, మధుసూధనాచారి పోలీసులు కిరణ్, జాఫర్ ఖాన్, సుబ్రమణ్యం, మధు పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ దృష్యా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా మండలంలో 144 సెక్షన్ ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ సెక్షన్ 144(2), సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఏ ప్రాంతంలో అయిన నలుగురి కంటే ఎక్కువ మంది గుమిగూడి ఉండరాదని ఈనెల 6వరకు ఎలాంటి ర్యాలీలు, ఊరేగింపులు చేయరాదన్నారు. అలాగే మద్యం, బాణాసంచా, లౌడ్ స్పీకర్, కర్రలు వంటి వాటిని నిషేధించినట్లు తెలిపారు. సమస్యాత్మక గ్రామాలలో కౌంటింగ్‌ను దృష్టిలో వుంచుకొని రాచవేటివారిపల్లి నుంచి సామకోటవారిపల్లి వరకు మూడు పోలీసు టీమ్‌లు పికెటింగ్ నిర్వహిస్తూ ఎలాంటి గొడవలు అల్లర్లు జరగకుండా చూస్తున్నామన్నారు. గ్రామాల్లో గొడవలకు దిగవద్దని తెలిపారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

పెద్దమండ్యం, జూన్ 3: రోగులకు మెరుగైన సేవలను అందించాలని పీహెచ్‌సీ డాక్టర్లు ఇమ్మానుయల్, హరివర్మ పేర్కొన్నారు. పెద్దమండ్యం మండలంలో సోమవారం వారు మాట్లాడుతూ గ్రామాలలో వైద్య సిబ్బంది పర్యటించి ప్రజలకు ఆరోగ్య సూత్రాలను తెలియజేయాలన్నారు. సీజనల్ జ్వరాలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. గ్రామాలలో వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకోవాలన్నారు. గర్భవతులు, 0-5 సంవత్సరాలలోపు పిల్లలకు సకాలంలో టీకాలను వేయాలన్నారు.

కౌంటింగ్‌లో జాగ్రత్తగా ఉండాలి

●వైసీపీ కవ్వించినా..సంయమనం పాటించండి● ఏజెంట్లతో మదనపల్లె, తంబళ్లపల్లె కూటమి అభ్యర్థులు షాజహాన్, జయచంద్రారెడ్డి



మదనపల్లెలో కౌంటింగ్ ఏజెంట్లకు సూచనలిస్తున్న ఉమ్మడి కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా



ములకలచెరువలో టీడీపీ శ్రేణులతో సమావేశమైన తంబళ్లపల్లె కూటమి అభ్యర్థి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, జూన్ 3: జిల్లా కేంద్రమైన రాయచోటి లో మంగళవారం జరిగే ఎన్నికల కౌంటింగ్ సమయంలో జాగ్రత్తగా ఉండాలని ఆయా నియోజకవర్గాల ఉమ్మడి కూటమి అభ్యర్థులు వారి వారి పరిధిలోని కూటమి ఏజెంట్లకు సూచించారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పై ఆయా నియోజకవర్గాల కూటమి నేతలు ఏజెంట్లతో సమావేశమై కౌంటింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇందులో భాగంగా తంబళ్లపల్లె నియోజకవర్గానికి సంబంధించి నియోజకవర్గ ఉమ్మడి కూటమి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం టీడీపీ నాయకులు, కౌంటింగ్ ఏజెంట్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ ప్రారంభం నుంచి చివరి వరకు అప్ర మత్తంగా ఉండాలని పూర్తి ఫలితాలు వెల్లడి అయ్యేదాకా అశ్రద్ధ చూప రాదన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, టీడీపీ మండల అధ్యక్షులు పాలగిరి సిద్ధా, రెడ్డెప్పరెడ్డి, వైజీ సురేంద్రయాదవ్‌లతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ కవ్వించినా.. సంయమనం పాటించండి

మదనపల్లె టౌన్, జూన్ 3: ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో వైసీపీ ఏజెంట్లు కవ్వింపు చర్యలకు పాల్పడినా టీడీపీ కౌంటింగ్ ఏజెంట్లు సంయమనం పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని మదనపల్లె ఉమ్మడి కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా పేర్కొన్నారు. సోమవారం కర్ణాటక రాష్ట్రంలోని ఓ రిసార్టులో ఉమ్మడి కూటమి ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షాజహాన్‌బాషా మాట్లాడుతూ ఫారం 17-సీలో నమోదైన ఓట్ల వివరాలను, కంట్రోల్ యూనిట్‌లో నమోదైన ఓట్ల లెక్క సరిచూసుకోవాలన్నారు. తేడా వస్తే వెంటనే రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ముఖ్యంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో ఇతరులు అభ్యంతరాలు చేస్తే కౌంటింగ్ సూపర్‌వైజర్ల దృష్టికి తీసుకెళ్లి అభ్యరంతరాన్ని పరిష్కరించే దిశగా మాట్లాడాలన్నారు. అన్ని రౌండ్లలో కౌంటింగ్ పూర్తి అయ్యాక, రిటర్నింగ్ అధికారి డిక్లరేషన్ ఇచ్చాకనే కౌంటింగ్ ఏజెంట్లు కేంద్రం వదలి బయటకు రావాలన్నారు. అలాగే ఏజెంట్లు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను వివరించారు.

పీలేరు నియోజకవర్గంలో 21 రౌండ్ల లెక్కింపు



పీలేరు పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



వరంపాటివారిపల్లెలో గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ మోహన్ రెడ్డి

పీలేరు, జూన్ 3: పీలేరు నియోజకవర్గ పరిధిలో ఆరు మండలాలు ఉండగా 281 పోలింగ్ కేంద్రాల్లోని ఓట్ల లెక్కింపు 21 రౌండ్లు ఉంటుందని అధికారుల అంచనా. నియోజకవర్గంలోని గుర్రంకొండ, కలకడ, కేవీపల్లె, వాల్మీకిపురం, కలికిరి, పీలేరు మండలాల్లో మొత్తం 281 పోలింగ్ కేంద్రా లున్నాయి. పోలింగ్ కేంద్రాలు గుర్రంకొండ మండలంలో ప్రారంభమై పీలేరు మండలంలో ముగుస్తాయి. అందులో భాగంగా గుర్రంకొండ మం డలంలో 1వ పోలింగ్ కేంద్రం నుంచి 43 వరకు, కలకడ మండలంలో 44 నుంచి 73, కేవీపల్లె మండలంలో 74 నుంచి 112, వాల్మీకిపురం మండలంలో 113 నుంచి 161, కలికిరి మండలంలో 162 నుంచి 209, పీలేరు మండలంలో 210 నుంచి 281 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఓట్ల లెక్కింపు కోసం 14 పోలింగ్ కేంద్రాలను ఒక రౌండ్‌గా విభజించారు. దీంతో పీలేరు నియోజకవర్గ ఫలితాలు 21 రౌండ్లలో వెలువడనున్నాయి. గుర్రంకొండ మండలంలోని టి.పసలవాండ్లపల్లెలోని మొదటి పోలింగ్ కేంద్రంతో లెక్కింపు ప్రక్రియ ప్రారంభమై పీలేరు మండలం ఎర్రగుంటపల్లె పంచాయతీలోని దేవలవారిపల్లె పోలింగ్ కేంద్రంతో ముగుస్తుంది. మే 13న జరిగిన పోలింగ్‌లో అన్నమయ్య జిల్లాలోనే అత్యధికంగా పీలేరు నియోజకవర్గంలో 1,90,234(81 శాతం) మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పోలీసుల పటిష్ట బందోబస్తు

కౌంటింగ్ రోజుగానీ, ఆ తరువాతగానీ ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా చూసుకోవాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పీలేరు అర్బన్ పోలీసులు ఇప్పటికే పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టారు. సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన తలపుల, రెడ్డివారిపల్లె, పీలేరు, ఎర్రగుంటపల్లె గ్రామాల్లో ఇప్పటికే పికెట్లు ఏర్పాటు చేశారు. సమస్యలు సృష్టించగలరని అనుమానితులుగా ఉన్న 100 మందికి ముందస్తు నోటీసులు జారీ చేశారు. సీఐ, ఎస్ఐల ఆధ్వర్యంలో రెండు క్విక్ రెస్పాన్స్ టీంలు ఏర్పాటు చేశారు. ఆసుపత్రులు వంటి అత్యవసర సేవల ప్రాంతాల్లో తప్ప చివరకు టీ అంగళ్ల వద్ద కూడా ఎవరూ గుమిగూడకూడదన్న ఆదేశాలు జారీ చేశామని పీలేరు అర్బన్ సీఐ మోహన్ రెడ్డి తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కేంద్ర బలగాలతో కలిసి కవాతు నిర్వహించడమే కాకుండా గ్రామస్థులో మాట్లాడామని, ఎటువంటి సంఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని ఆయన వివరించారు. ఈ క్రమంలో సోమవారం ఆయన పీలేరు పట్టణంతోపాటు వేపులబైలు పంచాయతీలో తన సిబ్బందితో కలిసి కవాతు నిర్వహించారు. తమ హెచ్చరికలు బేఖాతరు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రాయచోటికి చేరుకున్న ప్రధాన పార్టీల ఏజెంట్లు

కౌంటింగ్ ప్రక్రియ కోసం సోమవారం రాత్రికే ప్రధాన పార్టీలైన టీడీపీ, బీజేపీ, వైసీపీకి చెందిన అధిక శాతం మంది ఏజెంట్లు రాయచోటికి చేరుకున్నారు. ఉదయం 6 గంటలకే కౌంటింగ్ కేంద్రంలో ఉండాల్సి రావడంతో ప్రధాన పార్టీల నాయకులు ముందు జాగ్రత్త చర్యగా తమ ఏజెంట్లను సోమవారం రాత్రి రాయచోటిలో వారికి బస ఏర్పాటు చేశారు. మిగిలిన వారిని కూడా మంగళవారం ఉదయం 6 గంటలకల్లా కౌంటింగ్ కేంద్రం వద్దకు చేరుకోవాలని వారు సూచించారు.

జాతీయస్థాయి క్విజ్ పోటీలకు జ్ఞానాంబిక విద్యార్థులు ఎంపిక




క్విజ్‌పోటీల ఫైనల్ రౌండ్‌కు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ రమాదేవి

మదనపల్లె టౌన్, జూన్ 3: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యురిటి మార్కెట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ ఫైనాన్షియల్ లిటరసి క్విజ్ పోటీల్లో శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ఫైనల్ రౌండ్‌కు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఎస్.రమాదేవి పేర్కొన్నారు. సోమవారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నేషనల్ ఫైనాన్షియల్ లిటరసి క్విజ్ పోటీల్లో తమ కళాశాలకు చెందిన విద్యార్థినులు కె.రుషిత, ఎస్.సుజితలు అత్యుత్తమ ప్రతిభ కనపరచి జాతీయస్థాయిలో మూడో స్థానంలో నిలిచారన్నారు. ఈనెల 30వ తేదీన ముంబైలో నిర్వహించే ఫైనల్ రౌండ్‌కు ఎంపికయ్యారని, వారికి నిర్వాహకులు రూ.25వేల నగదు బహుమతి అందిస్తారన్నారు. ఫైనల్‌రౌండ్‌లో వీరిద్దరు గెలవాలని ఆకాంక్షించారు. ఫైనల్‌రౌండ్‌కు ఎంపికైన విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ రామవేంద్ర, అధ్యాపకులు అభినందించారు.

నీలకంఠేశ్వరుడికి విశేషాలంకరణ

మదనపల్లె అర్బన్, జూన్3: స్థానిక నీరుగట్టువారిపల్లె నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో సోమవారం నీలకంఠేశ్వర స్వామికి ఆలయకమిటీ ఆధ్వర్యంలో అభిషేకాలు, అర్చనలు విశేష అలంకరణలు చేశారు. అనంతరం స్వామికి రుద్రాభిసేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శనం చేసుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు అన్నదానం మదనపల్లె పట్టణం, నీరుగట్టువారిపల్లె, రామిరెడ్డి లేవుట్‌కు చెందిన శ్రీవాణి కోచింగ్ సెంటర్ అధినేతలు ఎద్దుల శ్రీధర్, ఎద్దుల గాయిత్రి, ఎద్దుల హర్షణి, ఎద్దుల వాయునందన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ నిర్వహకుడు గుడి రామాంజులు పర్యవేక్షించారు.

వామ్మో..! కుక్కల బెడద



పెద్దమండ్యం, జూన్ 3: పెద్దమండ్యం మండలంలో కుక్కల బెడద ఎక్కువైందని ప్రజలు భయప డుతున్నారు. పెద్దమండ్యం బస్టాండ్ ప్రాంతంలో సోమవారం ద్వీచక్రవాహనం లో వెళుతున్న పెద్దమండ్యం కుమ్మరవీధికి చెందిన దంపతులను కుక్కలు వెంబడించాయి దీంతో వారు కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. అలాగే గత ఆదివారం సి. గొల్లపల్లి గ్రామ పంచాయతీ రెక్కలకొండపల్లి లో గొర్రెల మందపై దాడి చేయగా 15 గొర్రెలు మృత్యు వాత పడగా సోమవారం మట్లివారిపల్లి లో 10 గొర్రెలు మృత్యు వాత పడ్డాయి. అధికారులు చర్యలు తీసుకొని మండలంలో కుక్కల బెడద నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

జాక్‌పాట్ విధానాన్ని రద్దు చేయాలి



కార్యదర్శికి వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

గుర్రంకొండ, జూన్ 3:గుర్రంకొండ టమోటా మార్కెట్ యార్డులో జాక్‌పాట్ విధానాన్ని పూర్తి స్థాయిలో రద్దు చేయాలని రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి, జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యుడు సాంబశివ కోరారు. ఆమేరకు సోమవారం గుర్రంకొండ మార్కెట్ యార్డులో రైతులతో మాట్లాడారు. మార్కెట్ యార్డులో జాక్‌పాట్ విధానంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా గుర్రంకొండ మార్కెట్ యార్డులో జాక్‌పాట్ విధానం అమలు చేయడంతో దారుణమన్నారు. ఈ విధానంతో టమోటాకు ధరలున్న సమయంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. జాక్‌పాట్ విధానంపై మార్కెట్‌శాఖ అధికారులకు పలుమార్లు రైతులు తెలిపిన పట్టించుకోవడం లేదని వాపోయారు. జాక్‌పాట్ విధానాన్ని పూర్తి స్థాయిలో రద్దు చేయాలని, లేకుంటే రైతులతో కలిసి ధర్నాలు చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం కార్యదర్శి కుమార్‌రెడ్డికి జాక్‌పాట్‌ను రద్దు చేయాలని వినతి పత్రం అందజేశారు.

పుస్తకపఠనంతో విజ్ఞానం



విద్యార్థులతో గ్రంథాలయాధికారి అమరనాథ్

కలకడ, జూన్ 3:విద్యార్థులు పుస్తకపఠనాన్ని అలవాటు చేసుకోవ డం వలన విజ్ఞానం పెరుగుతుందని గ్రంథాలయాధికారి అమర నాథ్ పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఉదయం 8 గంటల నుంచి 11.30 వరకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులకు కథ పుస్తకాలు చదవ డం, చిత్రలేఖనంతోపాటు చెస్ ఆటలు ఆడడంపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టండి

పెద్దమండ్యం, జూన్ 3: గ్రామాలలో పారిశుధ్య పనులతో పాటు చెత్త సేకరణ కార్యక్రమాలు చేపట్టాలని పెద్దమండ్యం ఎంపీడీవో వెంకటరమణ్య పేర్కొన్నారు. పెద్దమండ్యం ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వర్షాకాలంలో గ్రామాలలో వీధులను, ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకోవాలన్నారు. ఇంటింటికి వెళ్లి పరిశుభ్రత గురించి సచివాలయ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ శ్రీదర్‌రావు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు జనార్ధన, శైలజ, ఆయిషా, సోమశేఖర, రెడ్డిప్రసాద్, ఖాదర్‌బాషా, జీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనకాయలు పంపిణీ చేయండి

● ఆర్బీకే సిబ్బందికి జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ సూచన



వేరుశనగ విత్తనకాయల పంపిణీని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

బి.కొత్తకోట, జూన్3: ఖరీఫ్‌సీజన్ కోసం సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలు పంపిణీలో నాణ్యతను తప్పకుండా చూడాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ ఆర్బీకే సిబ్బందికి సూచించారు. సోమవారం బి.కొత్తకోట మండలంలోని గోళ్లపల్లెలో విత్తనకాయల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్బీకేల సిబ్బంది విత్తనకాయలను పరిశీ లించి బాగా ఉంటేనే రైతులకు ఇవ్వాలని, లేకుంటే వెనక్కు పంపాలన్నారు. నాణ్యత విష యంలో రైతులనుంచి ఎటువంటి ఫిర్యాదులు లేకుండా చూసుకోవాలని, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పలువురు రైతులతో మాట్లాడి కాయల పంపిణీ తీరు, నాణ్యత విషయమై ఆరా తీశారు. అలాగే సాగుచేసిన పంటను ఈ-క్రాప్ లో నమోదు చేయించుకోవాలన్నారు. విత్తనకాయలను తీసుకొని వాటిని దుర్వినియోగం చేస్తే ఇచ్చిన సబ్సిడీని ప్రభుత్వం వెనక్కు తీసుకోవడంతో పాటు ప్రభుత్వ పథకాలకు అనర్హులవుతారని హెచ్చరించారు. మదనపల్లె ఏడీఏ దీక్షాకుమారి, మండల ఏవో చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్రంకొండలో: ప్రభుత్వం సరఫరా చేస్తున్న వేరుశనగ సబ్సిడీ విత్తన కాయలను తీసుకున్న రైతులు పంటను తప్పని సరిగా సాగు చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రనాయక్ పేర్కొన్నారు. మండలంలోని ఎల్లుట్ల ఆర్బీకేలో వేరుశనగ విత్తన కాయల పంపిణీని ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వేరుశనగ పంటను సాగు చేసేలా సిబ్బంది చూడాలన్నారు. విత్తనకాయలు తీసుకున్న రైతు పంట సాగు చేయకుంటే వారికి ఇచ్చిన సబ్సిడీని ప్రభుత్వం వెనక్కి తీసుకొనే చర్యలు తీసుకుంటుందన్నారు. అలాగే ఈ క్రాప్‌లో పంట సాగు నమోదును తప్పకుండా చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో నవీన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



విత్తనాల పంపిణీ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో పోలప్ప

ములకలచెరువులో: ఖరీఫ్‌లో రైతులకు సబ్సిడీతో అందిస్తున్న వేరుశనగ విత్తనకాయల పంపిణీని పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో పోలప్ప సూచించారు. మండలంలోని కదిరినాథునికోట రైతు భరోసా కేంద్రంలో జరుగుతున్న వేరుశనగ విత్తన కాయల పంపిణీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలు పంపిణీ చేసే సమయంలో నాణ్యతను పరిశీలించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం విత్తనాల పంపిణీకి సంబంధించిన రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ లత, పంచాయతీ కార్యదర్శి సమరసింహారెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ శిరీషా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ నేత సురేంద్రయాదవ్ జన్మదిన వేడుకలు



కేకు కట్ చేస్తున్న రాజంపేట పార్లమెంటు బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్

తంబళ్లపల్లె, జూన్ 3: టీడీపీ రాజంపేట పార్లమెంటు బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్ జన్మదిన వేడుకలను సోమవారం తంబళ్లపల్లెలో టీడీపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సురేంద్రయాదవ్‌చే భారీ కేకు కట్ చేయించి ప్రజలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో గ్రామాధ్యక్షుడు సాంబశివ, ప్రధాన కార్యదర్శి మ్యూజికల్స్ శివ, తెలుగుయువత నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నరసింహులు, కార్యనిర్వహణ కార్యదర్శి మధుసూదన్, పార్లమెంటు బీసీ సెల్ కార్యదర్శి అశోక్, మాజీ ఉపసర్పంచ్ మణి, యూనిట్ ఇన్‌చార్జ్ నారాయణ, టైల్స్ శీన, పీర్లమాబు, మల్లేష్, నాగభూషణం, మల్లి, చలపతి తదితరులు పాల్గొన్నారు.

కురబలకోటలో: టీడీపీ రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్ర యాదవ్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల నడుమ కేక్ కట్‌చేసి వేడుకలను జరుపుకున్నారు. అలాగే మదనపల్లెలోని నరసింహస్వామి ఆలయంలో అభిషేకం, పూజలు నిర్వహించి, వెలుగు అనాథశరణాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన నాయకులు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం వెలువడనున్న ఎన్నికల ఫలితాల్లో టీడీపీ విజయం సాధించి చంద్రబాబునాయుడు సీఎం అవుతారన్నారు. కార్యక్రమంలో రాజంపేట తెలుగు యువత కార్యదర్శి అయాబ్ బాషా, బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుత్తికొండ త్యాగరాజు, నాము శీన, తిమ్మరాయుడు, సిద్దవరం ప్రసాద్, వెంకటరెడ్డి, ముబారక్, బొగ్గు భాస్కర్, ఆలం, మాజీ వైస్ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, సదాశివ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల కోసం వృద్ధుల అగచాట్లు



వాల్మీకిపురం ఇండియన్ బ్యాంక్ నందు పింఛన్ల కోసం బారులు తీరిన వృద్ధులు, లబ్ధిదారులు

వాల్మీకిపురం, జూన్ 3: వాల్మీకిపురంలో సోమవారం పింఛన్ల కోసం వృద్ధుల అగచాట్లు అన్నీఇన్నీ కావు. ఉదయం 8గంటల నుంచే పట్టణంలోని బ్యాంకుల వద్ద వృద్ధులు, లబ్ధిదారులు చేరుకోవడంతో బ్యాంకుల వద్ద రద్దీ నెలకొంది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో నేరుగా ఇంటింటికీ పంపిణీ చేసే పింఛన్లు కొందరికి బ్యాంకు ఖాతాలు, మరికొందరికి పంపిణీ చేయడంతో బ్యాంకుల చెంత లబ్ధిదారులు నిరీక్షించాల్సి వచ్చింది. వయస్సు మీరిన వృద్ధులకు నేరుగా ఇళ్లవద్దకే పంపిణీ చేయమని ఎన్నికల సంఘం సూచించినా ప్రభుత్వం బ్యాంకు అకౌంట్లలో లబ్ధిదారులకు పెన్షన్ డబ్బులు వేయడంతో బ్యాంకుల చెంత గంటల తరబడి వృద్ధులు నిరీక్షించాల్సి వచ్చింది.

వైభవంగా నల్లవీరగంగాభవానీ ఊంజల్‌సేవ



వాల్మీకిపురం, జూన్ 3: వాల్మీకిపురం పట్టణం రైల్వేస్టేషన్ సమీపంలో వెలసిన నల్లవీరగంగాభవానీ అమ్మవారి ఆలయంలో ఊంజల్‌సేవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. సోమవారం ఉదయం ఆలయంలో అమ్మవారికి అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం అమ్మవారికి విశేషాలంకరణలు గావించి భక్తజనం నడుమ ఊంజల్‌సేవ కన్నుల పండువగా సాగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమాలలో ఆలయ ధర్మకర్త రమణారెడ్డి, ఉత్సవ కమిటీ ఛైర్మన్ మొర్రంరెడ్డి రామ్‌కుమార్ రెడ్డి, అర్చకులు జనార్దనస్వామి, సభ్యులు ఆనందశెట్టి, బలరామ్, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీతో కూడా ఉద్యోగాలు సాధించవచ్చు



సదస్సులో మాట్లాడుతున్న ఇర్ఫాత్

పీలేరు, జూన్ 3: డిగ్రీ విద్యకు సాంకేతిక కోర్సులను జతచేసుకుంటే ఆకర్షణీయమైన వేతనాలతో కూడిన ఉద్యోగాలు సాధించవచ్చని ప్రముఖ సంస్థ నార్త్‌స్టార్ అకాడమీ డైరెక్టర్ ఇర్ఫాత్ పేర్కొన్నారు. పీలేరులోని సీఎస్ఆర్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం పీలేరు ప్రాంత విద్యార్థులకు ఇంటర్ తరువాత విద్య, ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీతో మెరుగైన ఉపాధి అవకాశాలు పొందలేమన్న అపోహలో చాలా మంది విద్యార్థులున్నారని, మారిన సాంకేతిక, ఆర్థిక, జీవనోపాధుల నేపథ్యంలో డిగ్రీతో కూడా మంచి ఉపాధి అవకాశాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. అనంతరం ప్రముఖ సంస్థలైన కార్గిల్ సర్వీసెస్, వాల్‌మార్ట్, డెలాయిట్, టీసీఎస్, ఐబీఎం, అసెంచర్, క్యాప్ జెమిని, బిర్లా సాఫ్ట్ ప్రతినిధులు విద్యార్థులకు తమ సంస్థల్లోని ఉద్యోగావకాశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ కళాశాల కరస్పాండెంట్ విజయభాస్కర రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ లావణ్య, అధ్యాపకులు బాలాంజనేయులు, బోదేషావలి, రాధాకృష్ణ, మహేశ్, కిరణ్, జ్ఞానశ్రీ, అజిత, అరుణ, షబ్నం, తదితరలు పాల్గొన్నారు.